News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

CK NEWS చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 01 | సంచిక :313 | ఖమ్మం | శనివారం,డిసెంబర్ 23, 2023 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# 'డబ్బులు ఉంటేనే రాజకీయాలు' అనే ఆలోచనను పక్కన పెట్టాలి

- ప్రజలలోకి వెళ్లి సేవ చేస్తే వారు తప్పకుండా ఆదరిస్తారన్న రేవంత్ రెడ్డి
- ప్రజల ఆశీర్వాదం, నిరుద్యోగుల పోరాటం వల్లే తెలంగాణలో కాంగ్రెస్ గెలిచిందని వ్యాఖ్య
- విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తాము అండగా ఉంటామని హామీ



సీకే న్యూస్ హైదరాబాద్ :డబ్బులుంటేనే రాజకీయం అనే ఆలోచనను పక్కన పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని బీఆర్ అంబేద్కర్ కళాశాలలో... కాకా వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రజల ఆశీర్వాదం, నిరుద్యోగుల పోరాటం వల్లనే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు. డబ్బులు ఉంటేనే రాజకీయాలు

వివరాలు 2లో..

# ఏపీలో కొత్త రాజకీయ పార్టీ

జై భారత్ నేషనల్ పార్టీ స్థాపించిన సీబీఐ మాజీ జేడీ

ఇది పెట్టిన పార్టీ కాదు... పుట్టిన పార్టీ అని వెల్లడించిన లక్ష్మీనారాయణ

ఇప్పుడున్న పరిస్థితులు మార్చడానికి పుట్టిన పార్టీ అని స్పష్టీకరణ

సీకే న్యూస్ హైదరాబాద్ :సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. తన పార్టీ పేరు జై భారత్ నేషనల్ పార్టీ అని లక్ష్మీనారాయణ వెల్లడించారు. ఐపీఎస్ కు స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ప్రజల మధ్యకు వచ్చానని తెలిపారు. అనేక వర్గాల ప్రజలను కలుసుకుంటూ, వారి సమస్యలను అవగాహన చేసుకుంటూ ముందుకు సాగుతున్నానని



వివరాలు 2లో..



# వైద్యశాఖ అప్రమత్తం

- పెరుగుతున్న కరోనా పాజిటివ్ కేసులు
- జిల్లా ఆసుపత్రిలో 100 పడకల కొవిడ్ వార్డు
- పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు : డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి

సీకే న్యూస్ హైదరాబాద్ : కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతుండటంతో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు జిల్లా ఆసుపత్రిలో చికిత్స అందించేందుకు ముందస్తుగా ఏర్పాట్లు చేపట్టారు. హైదరాబాద్‌లో గురువారం వరకు 20 కేసులు నమో దు కాగా శుక్రవారం 15నెలల చిన్నారి కొవిడ్ బారిన పడినట్లు వైద్యులు గుర్తించారు. ప్రస్తుతం పాప ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు ప్రకటించారు.

వివరాలు 2లో..

# పెండింగ్ చలాన్‌లపై భారీ రాయితీ..

- ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లపై 90 శాతం, టూ వీలర్స్‌పై 80 శాతం రాయితీ ప్రకటించిన ప్రభుత్వం
- ఆటోలు, ఫోర్ వీలర్స్‌పై 60 శాతం, భారీ వాహనాలపై 50 శాతం తగ్గింపు ప్రకటన
- ఈ నెల 26వ తేదీ నుంచి 2024 జనవరి 10వ తేదీ వరకు ఈ అవకాశాన్ని ఉంటుందన్న ప్రభుత్వం



సీకే న్యూస్ హైదరాబాద్ :మీ బైక్ పై చలాన్లు ఉన్నాయా.. మీ కార్లపై చలాన్లు ఉన్నాయా.. వేలకు వేల రూపాయలు ఎలా కట్టాలని బాధపడుతున్నారా.. డోంట్ వర్రీ.. అలాంటి వారి కోసం తెలంగాణ ప్రభుత్వం బంపరాఫర్ ఇచ్చింది. పెండింగ్ చలాన్ల క్లియరెన్స్ స్కీం తీసుకొచ్చింది. భారీ డిస్కౌంట్ తో పెండింగ్ చలాన్లు చెల్లించొచ్చని ప్రకటించింది ప్రభుత్వం. 2023, డిసెంబర్ 26వ తేదీ నుంచి డిస్కౌంట్ కింద పెండింగ్ చలాన్లు కట్టే అవకాశాన్ని కల్పిస్తుంది. ఆర్టీసీ డ్రైవర్స్, తోపుడు బండ్ల వారికి 90 శాతం డిస్కౌంట్ ఇచ్చింది. వంద రూపాయలకు పది రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. అదే విధంగా టూ వీలర్స్.. బైక్స్ పై 80 శాతం డిస్కౌంట్.. అంటే వెయ్యి రూపాయల చలాను అసలు ఉంటే.. డిస్కౌంట్ కింద 200 రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. ఇక కార్లు, ఆటోలపై 60 శాతం డిస్కౌంట్.. వెయ్యి రూపాయలు ఉంటే 400 రూపాయల చలానా చెల్లిస్తే సరిపోతుంది. లారీలతో పాటు ఇతర హెవీ వెహికిల్స్ కి 50 శాతం డిస్కౌంట్ ఇస్తుంది సర్కార్. ఆన్ లైన్ తో పాటు మీ సేవ సెంటర్స్

వివరాలు 2లో..

# అణుబాంబు పరీక్షలకు సిద్ధమవుతున్న చైనా?

న్యూయార్క్ టైమ్స్ కథనంలో వెల్లడి

జింజియాన్ ప్రావిన్స్‌లోని లోప్ నూర్ అణుపరీక్ష కేంద్రం ఆధునికీకరణ

భద్రతా వ్యవస్థల ఏర్పాటు, కొండల్లో సొరంగాల నిర్మాణం

కొత్త తరం మిసైళ్లకు అధునాతన అణువార్ హెడ్స్ అమర్చి పరీక్షలు

సీకే న్యూస్ హైదరాబాద్ :చైనా అణుబాంబు పరీక్షలకు సిద్ధమవుతోందన్న వార్త ప్రస్తుతం అంతర్జాతీయంగా కలవరం రేపుతోంది. జింజియాన్ ప్రావిన్స్‌లోని లోప్ నూర్ అణు పరీక్షా కేంద్రంలో మళ్లీ కార్యక్రమాలు ప్రారంభమవటమే దీనికి కారణం. ఇందుకు సంబంధించిన ఉపగ్రహ చిత్రాలను న్యూయార్క్ టైమ్స్ ప్రచురించడం సంచలనంగా



వివరాలు 2లో..

# జేఎన్1 వేరియంట్ ను తక్కువగా అంచనా వేయొద్దు


భారత్ లో మళ్లీ కరోనా కలకలం

కొత్త వేరియంట్ ను జేఎన్1 గా గుర్తించిన కేంద్రం

నిత్యం వందల సంఖ్యలో కొత్త కేసులు

ఇప్పటికే రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం

సీకే న్యూస్ హైదరాబాద్ : భారత్ లో జేఎన్1 కరోనా వేరియంట్ పాజిటివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) మాజీ చీఫ్ సైంటిస్ట్ సౌమ్య నాథన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జేఎన్1 వేరియంట్ ను తక్కువగా అంచనా వేయొద్దని హెచ్చరించారు. దీన్ని సాధారణ జలుబు కింద కొట్టిపారేయలేమని, ప్రజలు దీని పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జాతీయ మీడియాతో మాట్లాడుతూ, సౌమ్య స్వామినాథన్ 5 అంశాలను ప్రస్తావించారు. 1. సాధారణ జలుబుతో పోల్చి చూస్తే ఇది చాలా ప్రత్యేకమైన



వివరాలు 2లో..

# ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు పన్నుల వాటా విడుదల చేసిన కేంద్రం



రాష్ట్రాలకు పన్నుల వాటా రూ.72,961 కోట్ల విడుదల

ఏపీకి రూ.2,952 కోట్లు, తెలంగాణకు రూ.1,533 కోట్లు విడుదల

అత్యధికంగా ఉత్తరప్రదేశ్ కు రూ.13,088 కోట్లు

పండుగ సీజన్ ను దృష్టిలో ఉంచుకుని ముందే విడుదల చేసిన కేంద్రం

సీకే న్యూస్ హైదరాబాద్ : రాష్ట్రాలకు పన్నుల్లో వాటాలను విడుదల చేసినట్టు కేంద్రం వెల్లడించింది. ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు పన్నుల వాటా రూపేణా రూ.72,961 కోట్లను విడుదల చేసింది. ఏపీకి రూ.2,952 కోట్లు, తెలంగాణకు రూ.1,533 కోట్లు విడుదల చేసింది. కేంద్రం అత్యధికంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి రూ.13,088 కోట్లు విడుదల చేసింది.బీహార్ కు రూ.7,338 కోట్లు, పశ్చిమ బెంగాల్ కు రూ.5,488 కోట్లు, మధ్యప్రదేశ్ కు రూ.5,727 కోట్లు, మహారాష్ట్రకు రూ.4,609 కోట్లు, రాజస్థాన్ కు

వివరాలు 2లో..

# గగన్‌యాన్‌తో మరోసారి చరిత్ర సృష్టిస్తాం

సీకే న్యూస్ హైదరాబాద్ : గగన్ యాన్ మిషన్ కోసం ఇస్రో తన లైఫ్ సపోర్ట్ సిస్టమ్ టెక్ ని అభివృద్ధి చేస్తుందని ఇస్రో చైర్మన్ ఎస్. సోమ్ నాథ్ వెల్లడించారు. ఇతర దేశాలు తమ రీసెర్చ్ లను పంచుకునేందుకు ఇష్టపడవని చైర్మన్ తెలిపారు. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనేజేషన్ (ఇస్రో) 2023లో చంద్రయాన్3 తో సహా అనేక సక్సెస్ ఫుల్ అంతరిక్ష ప్రయోగాలతో యూనివర్సల్ హిస్టరీ మేకర్ అయిందని సోమ్ నాథ్ అన్నారు. ఇస్రో చేసిన అంతరిక్ష పరిశోధనలకు ప్రపంచం ప్రశంసలు కురిపించిందన్నారు. ఇస్రో మరో అంతరిక్ష ఫ్లైట్ మిషన్.. గగన్ యాన్..

వివరాలు 2లో..



# గగన్‌యాన్‌తో మరోసారి చరిత్ర సృష్టిస్తాం

- మొదటి పేజి తరువాయి
దీనికోసం లైఫ్ సపోర్ట్ సిస్టమ్ టెక్నాలజీని పంచుకోవడానికి ఇతర దేశాలు పంచుకోవడానికి సిద్ధంగా లేవన్నారు. అయినప్పటికీ స్వదేశీ ఎన్విరాన్ మెంటల్ కంట్రోల్ లైఫ్ సపోర్ట్ సిస్టమ్ అభివృద్ధి చేస్తున్నందున ఇస్రో ఆశయానికి ఎలాంటి అడ్డంకులు లేవని సోమ్ నాథ్ ప్రకటించారు. ఈ మిషన్ తో భారత్ మరోసారి చరిత్ర సృష్టిస్తుందన్నారు. మనోహర్ పారికర్ విద్వాన్ మహోత్సవ్ 2023లో ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ..పర్యావరణ నియంత్రణ, లైఫ్ సపోర్ట్ సిస్టమ్ ను అభివృద్ధి చేయడంలో మాకు అనుభవం లేదు. రాకెట్లు, ఉపగ్రహాలు మాత్రమే రూపొందిస్తున్నాం..అయితే ఈ సపోర్టు ను ఇతర దేశాలనుంచి ఆశించాం. ఏ ప్రభుత్వమూ క్లిష్టమైన పరిజ్ఞానాన్ని అందించేందుకు సిద్ధంగా లేదు.

దశాబ్దాల కాలంగా సహకారం, సాంకేతికత పురోగతి ద్వారా అమెరికా), రోస్కోస్మోస్ (రష్యా), %జుూూ%( యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ) వంటి అంతరిక్ష సంస్థలు %జుజుూూ% వ్యవస్థల అభివృద్ధికి సహకారాన్ని అందించాయి. అయినప్పటికీ %ECLSS% సంబంధిత పరిశోధలను %ECLSS% తో పంచుకోవడంలో వారు విముఖత చూపారని..దీంతో %ECLSS% వ్యవస్థను స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించాలని ఇస్రో నిర్ణయించిందన్నారు.

%ECLSS% అంటే..

%ECLSS% సాంకేతిక.. అంతరిక్షంలోని అనేక సవాళ్లతో కూడిన వాతావరణంలో వ్యోమగామి మనుగడకు అవసరమైన గాలి నాణ్యత, నీటి సరఫరాను నిర్వహిస్తుంది. యాక్టివేటెడ్ చార్ కోల్ బెడ్లు, ఉత్ప్రేరక ఆక్సిడైజర్లు, మాలిక్యులర్ జల్లెడలతో కూడిన ఖచ్చితమై మెకానిజమ్ ల ద్వారా ఈ వ్యవస్థ క్యాబిన్ గాలి నాణ్యతను నియంత్రిస్తుంది. సిబ్బందికి శ్వాసక్రియ వాతావరణాన్ని నిర్ధారిస్తుంది.

2024లో గగన్ యాన్ మిషన్ కు అంతా సిద్ధం చేస్తున్నట్లు ఇస్రో చైర్మన్ సోమ్ నాథ్ తెలిపారు. క్రూ ఎస్కేప్ సిస్టమ్ మానవ రహిత విమాన పరీక్షలకు ఇస్రో సిద్ధమవుతోంది. మొదటి డెవలప్ మెంట్ ఫ్లైట్ టెస్ట్ వెహికల్(%ఆ-ఙ%1) తయారీ చివరి దశలో ఉన్నందున గగన్ యాన్ మిషన్ కోసం మానవ రహిత విమాన పరీక్షలను త్వరలో ప్రారంభిస్తామని భారత అంతరిక్ష సంస్థ ఇప్పటికే ప్రకటించింది.గగన్ యాన్ ప్రాజెక్ట్ లో భాగంగా భూమికి 400 మీటర్ల ఎత్తులో ఉన్న వృత్తాకార కక్ష్యలోకి ఇద్దరు లేదా ముగ్గురు సభ్యులతో కూడిన సిబ్బందిని ఇస్రో ప్రవేశపెట్టనుంది. ఈ మిషన్ ఒకటి నుంచి మూడు రోజులు పడుతుందని.. వ్యోమగాములు సురక్షితంగా భూమికి తిరిగి రావడానికి కావాల్సిన సిస్టమ్ పై దృష్టి సారించామని ఇస్రో చైర్మన్ సోమ్ నాథ్ తెలిపారు.

# ఏపీలో కొత్త రాజకీయ పార్టీ

- మొదటి పేజి తరువాయి
వివరించారు. సమస్యలు, పరిష్కారాలను వారినే అడిగి తెలుసుకుంటూ, రాష్ట్రం మొత్తం తిరిగి చేసిన అధ్యయనంతో రాజ్యాధికారం ముఖ్యమన్న విషయాన్ని గుర్తించానని వెల్లడించారు. ఆ విధంగా 2019 ఎన్నికల్లో పోటీ చేశానని, 3 లక్షల మంది వరకు ఓటర్లు మద్దతు పలికారని వివరించారు.

“ఆ ఎన్నికల తర్వాత కూడా రాష్ట్రంలో పర్యటిస్తూ యువతను, రైతులను, కార్మికులను, మత్స్యకారులను కలిసిన తర్వాత వాళ్ల ఆలోచనలు, వాళ్ల ఆకాంక్షలు పరిశీలించాను. ఒక పార్టీ ద్వారా రాష్ట్ర రాజకీయాల్లో మార్పు తీసుకురావాలని స్థాపించిన పార్టీ ఇది. ఇది పెట్టిన పార్టీ కాదు... ప్రజల కాంక్షలు, ఆకాంక్షలు, ఆలోచనల్లోంచి పుట్టిన పార్టీ... జై భారత్ నేషనల్ పార్టీ. మనదేశంలో ఇప్పుడున్న రాజకీయ పరిస్థితులు మీ అందరికీ తెలుసు, నాకు కూడా తెలుసు. రాజకీయాలంటే ప్రజలను మోసగించడమే అని అందరూ భావిస్తున్న పరిస్థితుల్లో... రాజకీయాలంటే సుపరిపాలన అని చాటిచెప్పడానికే జై భారత్ పార్టీతో ముందుకు వస్తున్నాం.

రాజకీయాలు అంటే మోసం అని భావించే ప్రజల అభిప్రాయాన్ని మార్చుతాం. 2014లో ఈ రాష్ట్రం ఏర్పడినప్పుడు ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంటులో మాట్లాడి, విభజన చట్టం వచ్చాక అందులో ఉన్న ప్రత్యేక హోదా గురించి ఎవరూ మాట్లాడలేదు. ప్రత్యేక హోదా వచ్చి ఉండుంటే రాష్ట్రంలో ఇంత నిరుద్యోగం ఉండేది కాదేమో! ఒకరేమో ప్రత్యేకహోదా వద్దు, ప్యాకేజీ ముద్దు అన్నారు... మరొకరు కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామన్నారు. ఇంకొకరు తలలు తెగిపడినా ఫర్వాలేదు కానీ, మేం పోరాడతాం అని అన్నారు. కానీ, ప్రత్యేకహోదా రాలేదు, ప్యాకేజీ అందలేదు, మెడలు వంగలేదు, తలలు తెగిపడిందీ లేదు. నిరుద్యోగం పెరిగిపోయింది, చదువుకున్న పిల్లలు ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయారు.

ప్రత్యేక హోదా అడగడానికి మనకు మూడు సార్లు అద్భుతమైన అవకాశం వచ్చింది. రాష్ట్ర ఎన్నికలు జరిగిన సందర్భంగా, ఉపరాష్ట్రపతి ఎన్నికలు జరిగిన సందర్భంగా, ఢిల్లీ సివిల్ సర్వీసెస్ చట్టాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు ప్రత్యేక హోదా అడగడానికి అవకాశం ఇచ్చింది. కానీ ప్రత్యేక హోదాపై అడిగే ధైర్యం ఎవరికీ లేకపోయింది. ఇప్పుడు ఎన్నికలు వస్తుండడంతో, ప్రత్యేకహోదా కోసం పోరాడతామంటూ మళ్లీ చెప్పబోతున్నారు. ఇలాంటి బూటకపు ప్రచారాలకు ముగింపు పలికి ప్రత్యేకహోదా తీసుకురావడానికి పుట్టిన పార్టీ... జై భారత్ నేషనల్ పార్టీ. ఎవరికీ తలవంచేది లేదు, ఎవరికీ సాష్టాంగ ప్రమాణాలు చేసేదిలేదు.... ప్రత్యేకహోదా కోసం పోరాడతామని మీ అందరి సమక్షంలో చెబుతున్నాను.

ప్రభుత్వాలు చట్టంలోని, రాజ్యాంగంలోని లోపాలను వెదికి ఎలా దోచుకోవాలని ఆలోచిస్తున్నాయే తప్ప, ప్రజలకు ఎలాంటి సేవలు అందించాలన్న తలంపు లేకపోయింది. వాళ్లు... వీరు తిన్నారు అంటారు... వీరేమో వాళ్లు కూడా తిన్నారు అంటారు. వేరొకరు తిన్నారులే అని బహిరంగంగా సభలో ప్రకటించి, ఫర్వాలేదులే అని మద్దతు ఇస్తున్నారు. ఎవరూ తినలేని వ్యవస్థ ఎలా ఉంటుందో చూపించడానికి పుట్టిన పార్టీ... జై భారత్ నేషనల్ పార్టీ. అవినీతిని అంతమొందించి, ఎవరూ ఒక్క రూపాయిని కూడా తినలేని విధంగా చేసే ప్రభుత్వాలు ఎలా ఉంటాయో పుట్టిన పార్టీ... జై భారత్ నేషనల్ పార్టీ. 75 ఏళ్ల కిందట దేశానికి లభించిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఎంతగానో దుర్వినియోగం అయ్యాయి. మనకు మనమే బందీలుగా మారిపోయాం.

పెత్తందార్లను మార్చాం గానీ, బానిసత్వం నడుస్తూనే ఉంది. ఒకరు అభివృద్ధి అభివృద్ధి అని ఒక నగరం నిర్మించడంపైనే దృష్టి కేంద్రీకరించి అవసరాలను మర్చిపోయారు. ఇంకొకరు అవసరాలు అవసరాలు అని అభివృద్ధిని పక్కకు నెట్టేశారు. అభివృద్ధితో ఎలా అవసరాలు తీర్చవచ్చో ప్రజలకు చెప్పి, బానిసత్వం నుంచి విముక్తి కలిగించడానికి పుట్టిన పార్టీ జై భారత్ నేషనల్ పార్టీ. డాలర్ తల ఎగరేస్తుంటే, తల దించుకోవాల్సిన దుస్థితికి దిగజారింది మన ఆర్థిక వ్యవస్థ. నిజానికి ప్రభుత్వాలను నిర్ణయిస్తోంది ప్రజలేనా అనే అనుమానం కూడా కలుగుతోంది. ఇప్పుడు ప్రజాస్వామ్యం ఎక్కడ అని వెతుక్కోవాల్సి వస్తోంది. దీనికి పరిష్కారం చూపడానికి పుట్టిన పార్టీ జై భారత్ నేషనల్ పార్టీ.

మేధావులను, ఆర్థికవేత్తలను ఉక్కు పాదాల కింద తొక్కుతున్న పరిస్థితి చూస్తున్నాం. సామాజిక బాధ్యత కలిగి సునిశిత విమర్శలు చేస్తున్నవారిని జైళ్లకు పంపిస్తున్నారు. ఇలాంటి వాటిని మనం నిస్సహాయంగా చూస్తూనే ఉన్నాం. రాష్ట్రంలో శాంతిభద్రతలు, మానవ హక్కుల రక్షణ సజావుగా ఉంటే మేం రావాల్సిన అవసరం ఉండేది కాదు. ఇవి లేవు కాబట్టి వాటిని దారిలో పెట్టడానికి పుట్టింది... జై భారత్ నేషనల్ పార్టీ” అని లక్ష్మీనారాయణ వివరించారు.

# వైద్యశాఖ అప్రమత్తం

- మొదటి పేజి తరువాయి
దీంతో వైద్య ఆరోగ్యశాఖ అన్ని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులను అప్రమత్తం చేసింది. గత కొవిడ్ అనుభవాలను దృష్టిలో పెట్టుకొని, ప్రస్తుతం చేపట్టాల్సిన చర్యలపై వైద్య సిబ్బందికి సూచనలు ఇచ్చింది. కరీంనగర్ జిల్లాలో కూడా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో 100 పడకలతో కొవిడ్ వార్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెంట్రల్ ఆక్సీజన్, వెంటిలేటర్ సౌకర్యాలు ఉన్నాయన్నారు. వీటితో పాటు జిల్లా కేంద్రంలో అపోలో రీచ్, రెనె ఆసుపత్రి, సన్‌షైన్ ప్రైవేటు ఆసుపత్రులతో పాటు రెండు ప్రైవేటు మెడికల్ కాలేజీలను పరిశీలించినట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో కూడా ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. జ్వరం, దగ్గు, జలుబు, ఒంటి నొప్పులు వంటి లక్షణాలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్యకేంద్రాలకు వచ్చే వారిలో రోజుకు 5మందికి ఆర్‌టీపీసీఆర్ పరీక్షకు శాంపిళ్లను సేకరించి, జిల్లా ఆసుపత్రిలో గల టీ-హబ్‌కు పంపించాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేసింది. అట్టి శాంపిల్స్‌లో పాజిటివ్ వచ్చిన వారి శాంపిల్స్‌ను హైదరాబాద్‌లోని సీడీఎఫ్‌డి(సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్‌ప్రింట్ అండ్ డయాగ్నస్టిక్)కు పంపించాలని ఆదేశించింది. జెఎన్-1 వేరియంట్ తీవ్రత ఎక్కువగా లేకపోయినప్పటికీ మాస్కులు ధరిస్తే మంచిదని వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

**అప్రమత్తంగా ఉండాలి**

**డాక్టర్ లలితాదేవి , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి**

కరోనా జేఎన్-1 వేరియంట్ తీవ్రత ఎక్కువగా లేకపోయినప్పటికీ మాస్కులు ధరించడం మంచిది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మాస్కులు ధరించి, జాగ్రత్తగా ఉండాలి. అలాగే జ్వరంతో పాటు, దగ్గు, జలుబు, ఒంటి నొప్పులు, కడుపు నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే ఆర్‌టీపీసీఆర్ పరీక్ష చేయించుకోవాలి.

# అణుబాంబు పరీక్షలకు సిద్ధమవుతున్న చైనా?

- మొదటి పేజి తరువాయి
మారింది. కొత్త తరం బాలిస్టిక్ మిసైల్స్‌కు అమర్చిన నూతన వార్ హెడ్స్‌ను పరీక్షించేందుకు చైనా రెడీ అవుతున్నట్టు న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. రసాయనిక బాంబులతో సబ్‌క్రిటికల్ టెక్నాలజీలను కూడా చైనా పరీక్షించబోతున్నట్టు పేర్కొంది. ఈ దిశగా కొండల్లో భారీ సొరంగాలు కూడా తవ్వుతున్నట్టు పేర్కొంది.

అంతర్జాతీయ నిపుణుల నివేదికలు, శాటిలైట్ చిత్రాలను న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. గత కొన్నేళ్లుగా లోప్ నూర్ కేంద్రం అణుపరీక్షలకు అనువైన నిర్మాణాలు చేపడుతున్నట్టు ఈ చిత్రాల్లో స్పష్టమైందని పేర్కొంది. పురాతన భవన సముదాయమైన లోప్ నూర్ కేంద్రం 2017 నాటికే అత్యాధునిక వసతులను సంతరించుకుందని వెల్లడించింది. కేంద్రంలో అత్యాధునిక భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేసినట్టు న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. చైనాతో సఖ్యత కోసం అమెరికా ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ కథనం అగ్రరాజ్యంలో కలకలానికి దారి తీసింది.

## ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు పన్నుల వాటా విడుదల చేసిన కేంద్రం

- మొదటి పేజి తరువాయి
రూ.4,396 కోట్లు విడుదల చేసింది. వాస్తవానికి ఈ పన్నుల వాటా విడుదల 2024 జనవరి 10న విడుదల చేయాల్సి ఉండగా, పండుగ సీజన్, నూతన సంవత్సరాదిని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 11నే నిధులను విడుదల చేసినట్టు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నేడు వెల్లడించింది.

## జేఎన్1 వేరియంట్ ను తక్కువగా అంచనా వేయొద్దంటున్న డబ్ల్యూహెచ్ఓ మాజీ చీఫ్ సైంటిస్ట్

- మొదటి పేజి తరువాయి
వేరియంట్. ప్రజలు దీని వల్ల న్యుమోనియాతో తీవ్ర అనారోగ్యానికి గురికావడమే కాదు, దీర్ఘకాలంలో అనేక ఆరోగ్య సమస్యల బారినపడతారు.

2. ప్రపంచవ్యాప్తంగా కొవిడ్ తో బాధపడిన వారి సమాచారం ఇప్పుడు మన వద్ద ఉంది. గుండె సంబంధ సమస్యలతో బాధపడేవారు, స్ట్రోక్ బాధితులు, మధుమేహం, మతిమరుపు, మానసిక కుంగుబాటు, మానసిక సమస్యలు, దీర్ఘకాలిక అలసట, కండరాల నొప్పులతో బాధపడేవారు ఒక్కసారి కొవిడ్ బారినపడితే తిరిగి మామూలు ఆరోగ్యాన్ని సంతరించుకోవడం వారి శక్తికి మించిన పని అవుతుంది.

3. అందుకే కొవిడ్ పట్ల ఏ మాత్రం ఉదాసీనతకు చోటివ్వకూడదు. ఇప్పటికీ ఆ వైరస్ మహమ్మారి పట్ల జాగ్రత్తగా ఉండాలి. అయితే భయాందోళనలకు గురవ్వాల్సిన అవసరం లేదు.

4. ఇప్పుడు వ్యాపిస్తున్న కొత్త వేరియంట్ ను ఎదుర్కోవడానికి మనకందరికీ తెలిసిన ముందు జాగ్రత్త చర్యలు సరిపోతాయి. జేఎన్1 కూడా ఒమిక్రాన్ కుటుంబానికి చెందినదే. ఒమిక్రాన్ ఒకట్రెండు ఉత్పరివర్తనాలకు లోనై జేఎన్1 ఏర్పడి ఉంటుంది. అందుకే దీనిపై ఓ కన్నేసి ఉంచాలని డబ్ల్యూహెచ్ఓ కూడా చెబుతోంది. 5. గాలి సరిగా ప్రసరించని గదుల్లో ఉండరాదు. ముఖ్యంగా, మాస్క్ లేకుండా ఉన్న వ్యక్తులతో కలిసి ఎక్కువ సమయం గడపొద్దు. ఇతరులతో కలిసి ఓ గదిలో ఉండాల్సినప్పుడు మాస్క్ ధరించాలి.

## ‘డబ్బులు ఉంటేనే రాజకీయాలు’ అనే ఆలోచనను పక్కన పెట్టాలి

- మొదటి పేజి తరువాయి
చేయాలనే ఆలోచన సరికాదన్నారు. ప్రజలలోకి వెళ్లి సేవ చేస్తే వారు తప్పకుండా ఆదరిస్తారన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తాము అండగా ఉంటామన్నారు. కాకా వర్ధంతి సందర్భంగా వెంకటస్వామి విగ్రహానికి... రేవంత్ రెడ్డి నివాళు లర్పించారు. వివేక్, వినోద్‌లను చూసినప్పుడు తనకు రామాయణంలో లవకుశలు గుర్తుకు వస్తారని చెప్పారు. దేశ నిర్మాణంలో కాకా సామాజిక బాధ్యతను నిర్వర్తించినట్లు చెప్పారు. కాకా వర్ధంతి రోజున గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. తెలంగాణ ఉద్యమంలో కాకా కుటుంబం ముందు ఉందన్నారు. దేశానికి గాంధీ కుటుంబం ఎలాగో... తెలంగాణకు కాకా కుటుంబం అలాగే అన్నారు. అంతకుముందు కాలేజీలో కాకా విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.

## పెండింగ్ చలాన్‌లపై భారీ రాయితీ..

- మొదటి పేజి తరువాయి
లో డిస్కౌంట్ లో చలాన్స్ పేమెంట్ చేయొచ్చు. 2022 లో డిస్కౌంట్ ఇచ్చినప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా 300 కోట్ల చలాన్స్ వసూలు అయ్యింది. ఆ తర్వాత జనరేట్ అయిన చలానాలు చాలా వరకు పెండింగ్ లో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్లకు పైగా చలాన్లు పెండింగ్ లో ఉన్నాయి.. వందల కోట్ల రూపాయల విలువైన చలాన్లు కట్టాల్సి ఉంది వాహనదారులు.

## చెన్నూరులో కాకా వర్ధంతికి అన్నదానం, దుప్పట్ల పంపిణీ




కార్మిక యోధుడు, బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతి అయిన గడ్డం వెంకటస్వామి కాకా 9వ వర్ధంతిని పురస్కరించుకుని.. డిసెంబర్ 22వ తేదీన.. చెన్నూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు, ప్రజలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాకా చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్మికుల కోసం ఆయన నిరంతరం శ్రమించారని.. కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా కార్మికులకు పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చిన గొప్ప నేతగా కీర్తించారు కాంగ్రెస్ నేతలు. తెలంగాణ నా స్వప్నం అంటూ నిరంతరం పోరాడిని యోధుడుగా చెప్పుకొచ్చారు నేతలు. బడుగు, బలహీన వర్గాలు, పేదల అభ్యున్నతికి.. వారి పిల్లల చదువు కోసం బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో విద్యా సంస్థలను నెలకొల్పి.. ఉచితంగా విద్యను అందించిన వ్యక్తి కాకా అని కొనియాడారు నేతలు. ఈ సందర్భంగా చెన్నూరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు ఉచితం పండ్లు పంచిపెట్టారు. సత్యసాయి ట్రస్ట్ లోని వృద్ధులకు అన్నదానం చేశారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తానుగుల సతీష్, తానుగుల రవి, చెన్న వెంకటేష్, ఇతర నేతలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## “ఫుడ్ కమిషనర్” మీద చర్యలు తీసుకోవాలి.

- ఏపీ అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు),



**సీ కే న్యూస్ ఎటపాక ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబర్ 22,**
ఆంధ్ర ప్రదేశ్ ఫుడ్ కమిషనర్ చింతా విజయ్ ప్రతాప్ రెడ్డి అంగన్వాడి వర్కర్స్ మీద చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకో చేయాలని పిలుపునిచ్చింది. అందులో భాగంగా ఎటపాక మండలంలో అంగన్వాడీ టీచర్స్ రాస్తారోకో నిర్వహించారు. నిన్న జిల్లా పర్యటనకు వచ్చిన కమిషనర్ చింత విజయ్ ప్రతాప్ రెడ్డి అంగన్వాడి వర్కర్స్ మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడారు. “కోట్ల రూపాయలు ఖర్చు చేసి చీరలు, చరవానులు ఇచ్చాము. వాటి రీఛార్జ్ కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాము. అయినా ఇంకేమి కావాలి వీరికి, ఎందుకు జీతాలు పెంచాలి, అసలు పదో తరగతి చదివిన వీరికి ఇప్పుడు ఇస్తున్న జీతం చాలా ఎక్కువ. ఇంకా జీతం పెంచాలి అంటే ప్రభుత్వం గుండు కొట్టించు కోవాలి అని అవమానకరంగా మాట్లాడారు. ప్రభుత్వం 45 సంవత్సరాలు నిండిన వారికి ఏటా 18,500 ఇస్తూ కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నది.” అని మాట్లాడుతున్నారు. అయినా ఫుడ్ కమిషనర్ కి అంగన్వాడీ వర్కర్స్ జీతాలతో సంబంధం ఏమిటి? ఆయన పని సక్రమంగా చేయకుండా ఆయన హయాంలో అంగన్వాడీ సెంటర్స్ కి ఇస్తున్న సరుకు నాణ్యత లోపించింది అని అంటున్నా దీని మీద మాట్లాడకుండా మా జీతాల గురించి మాట్లాడి మమ్మల్ని అవమానించిన ఫుడ్ కమిషనర్ ప్రతాపరెడ్డి మీద ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, లేని ఎడల ఆందోళన ఇంకా తీవ్రతరం చేస్తామని ఎటపాక ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## వలిగొండ మండల కేంద్రంలో మండల సర్వసభ్య సమావేశం.

**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు డిసెంబరు 22.**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని. మండల సర్వసభ్య సమావేశం మండల ప్రజా పరిషత్ వలిగొండలో. ఎంపీపీ నూతి రమేష్ రాజు.




సభఅధ్యక్షుని ఆధ్వర్యంలో సజావుగా మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వలిగొండ మండలం పరిధిలోని ఎంపీటీసీలు మరియు సర్పంచులు మరియు వలిగొండ మండలం పరిధిలోని అన్ని డిపార్ట్మెంట్లకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

వచ్చిన మండల సర్వసభ్య సమావేశం సభ్యులకు అధికారులకు ఎంపీపీ నూతి రమేష్ రాజు సూచనలు ఇస్తూ భవిష్యత్తులో కార్యాచరణ సజావుగా ఎలా ముందుకెళ్లాలి అనే విధానాన్ని వివరించినారు. గత నాలుగు సంవత్సరాల నుండి జరిగిన అభివృద్ధి పనులను కొన్ని అధికారులు సభ్యుల ముందు వివరించినారు.

సర్వేసభ్య సమావేశానికి వచ్చిన ప్రజాప్రతినిథులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు.

డిసెంబరు 25 తర్వాత 31 లోపు సర్పంచుల మరియు ఎంపిటిసిల పదవీకాలం ముగిస్తున్నది కావున 31 లోపు ఒకరోజు ప్రత్యేక సమావేశం నిర్వహించుకోవాలని అందరికీ ఎంపీపీ రమేష్ రాజు తెలిపినారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వాకి టి పద్మ. వైస్ ఎంపీపీ బాతారాజు ఉమా .ఎండిఓ లెంకల గీతారెడ్డి. ఎండిఓ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ మంత్రివర్యులు మోత్కుపల్లి నర్సింహులు మర్యాద పూర్వకంగా కలిసిన తుంగ కుమార్ ...

**సి కే న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి (సంపత్) డిసెంబర్ 22 :**ఆలేరు మాజీ శాసనసభ్యులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రివర్యులు మోత్కుపల్లి నర్సింహులు అన్నను శుక్రవారం రోజున తన ఇంటి వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుడు తుంగ కుమార్ మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.ఈ సందర్భంగా తుంగ కుమార్ మాట్లాడుతూ..ఆలేరు మండల పరిదిలో స్థానిక సంస్థలపై చర్చించి అనంతరం వారికి కృతజ్ఞతలు తెలిపారు...



# ఆదరణ కరువైన వినియోగదారుల రక్షణ చట్టం

**చాయ్ బిస్కట్లతో సంవత్సరానికో సమావేశం**
**చట్టం ఉన్నట్లే తెలియని తెలంగాణా గ్రామీణం**

2019 లో అమల్లోకి వచ్చిన వినియోగదారుల రక్షణ చట్టం యొక్క ముఖ్యమైన ఉద్దేశ్యం “ వినియోగదారుల హక్కులను ప్రోత్సహించడం,రక్షించడం మరియు అమలు చేయడం”. వినియోగదారుల రక్షణ చట్టం 2019 వినియోగదారుల ఆరు రకాల హక్కులను నిర్వచించింది. 1.జీవితం మరియు ఆస్థికి ప్రమాదకరమైన వస్తువుల ఉత్పత్తుల సేవల మార్కెటింగ్ నుండి రక్షించబడడం. 2.వస్తువులు ఉత్పత్తులు సేవలలో నాణ్యత స్వచ్ఛత ప్రమాణం పరిమాణం శక్తి ధరల గురించి తెలుసుకోవడం 3.పోటీ ధరలకు వస్తువులు ఉత్పత్తులు మరియు సేవలు పొందే హక్కు 4.వినియోగదారుల ఫోరంలలో ఫిర్యాదు చేసే హక్కు 5.అన్యాయమైన వాణిజ్య పద్ధతుల ద్వారా చేసే వినియోగదారుల దోపిడీకి వ్యతిరేకంగా పరిష్కారాన్ని పొందే హక్కు. 6.వినియోగదారుల అవగాహన హక్కు. ఈ ఆరు రకాల హక్కులు పరిరక్షించబడాలంటే ముందుగా ప్రతి పౌరుడికి ఈ చట్టం గురించి అవగాహన పొందే హక్కు ఒకటి ఉన్నట్లు తెలియాలి. కానీ నేటి మన సమాజంలో వినియోగదారుల రక్షణ కోసం ఒక చట్టం ఉన్నట్లు కూడా తెలియని వారెందరో ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వినియోగదారుల రక్షణ చట్టం ఉందని తెలిసినవారు దాదాపు శూన్యమే. పట్టణ ప్రాంత ప్రజల్లోనూ ఈ చట్టం గురించి తెలిసిన వారు చాలా అరుదుగా ఉన్నారని చెప్పడం అతిశయోక్తి కాదు. ఒకవేళ తెలిసినవారు ఎవరైనా ఉన్నా చట్టం యొక్క ఉపయోగం గురించి ఇతరులకి చెప్పే ప్రయత్నం చేస్తున్న దాఖలాలు లేవు.

**జిల్లాలు పెరిగినా పాత కమీషన్లే:-**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 33 జిల్లాలు ఉండగా గతంలో ఉన్న 12 జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్లు (డి.సి.డి.ఆర్.సి) మాత్రమే ఉన్నాయి. జనాభాతో పాటు వినియోగదారుల సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రతి జిల్లాకు డి.సి.డి.ఆర్.సి లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. డి.సి.డి.ఆర్.సి లను ఏర్పాటు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నా ఎందుకో ఇంతవరకూ డి.సి.డి.ఆర్.సి ల ఏర్పాటు గురించి ఎక్కడా కనీస ప్రస్తావన కూడా తీసుకురాలేదు. అవగాహన లేని ప్రజలు దీని గురించి ఆలోచించకపోయినా వినియోగదారుల రక్షణ కోసం పనిచేస్తున్న సంస్థలు కూడా డి.సి.డి.ఆర్.సి ల ఏర్పాటు గురించి డిమాండ్ చేసిన దాఖలాలు లేవు. ఇటు ప్రభుత్వం కూడా ఇప్పటి వరకూ వినియోగదారుల రక్షణ చట్టం గురించి ప్రచారం గానీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం గానీ చేయడంలేదు. దీనివలన ప్రజల్లో అవగాహన లోపించి సమస్యలపై పోరాడకుండా నాణ్యత లేని కల్తీ వస్తువులను ఉపయోగిస్తూ రాజీపడి బ్రతుకుతున్నారు. వివాదాల పరిష్కారానికి అవసరమైన స్థాయిలో డి.సి.డి.ఆర్.సి లను ఏర్పాటు చేయకపోవడంతో దేశ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో కేసులు పేరుకుపోతున్నాయి. వినియోగదారుల వ్యవహారాలు మరియు ఆహార మరియు ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ వారు ఈ సంవత్సరం ప్రకటించిన వివరాల ప్రకారం దేశ వ్యాప్తంగా పాతిక లక్షలకు పైగా వినియోగదారుల సమస్యలపై కేసులు నమోదు కాగా ఐదున్నర లక్షల పైచిలుకు కేసులు పరిష్కారానికి నోచుకోకుండా ఇంకా పెండింగులోనే ఉన్నాయి. నిజానికి అడుగడుగునా అవినీతి నిండిపోయి పీల్చే గాలి తినే ఆహారం త్రాగే నీరు సహా మనం వాడుతున్న ప్రతి వస్తువు కల్తీ లేకుండా మన చేతికి రాని ప్రస్తుత కాలంలో వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఇంకా ఎక్కువ సంఖ్యలో కమీషన్లను ఏర్పాటు చేస్తే నమోదయ్యే కేసులు కోట్ల సంఖ్యలో ఉంటాయనడంలో ఎలాంటి సందేహం లేదు.జిల్లా స్థాయి డి.సి.డి.ఆర్.సి ల సంఖ్య పెరినప్పుడు ప్రభుత్వం చిత్తశద్ధితో వినియోగదారుల రక్షణ చట్టంపై సరైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పుడు ప్రజలు నాణ్యమైన వస్తు సేవలు పొందడానికి మార్గం సుగుమమవుతుంది.

**మొక్కుబడి సమావేశాలతో ఒరిగేదేమిటి?:-**

1986 డిసెంబర్ 24 న భారత దేశంలో వినియోగదారుల రక్షణ చట్టం అమల్లోకి వచ్చిన సందర్భంగా ప్రతీ సంవత్సరం డిసెంబర్ 24 ని జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుంది. ప్రస్తుత మన తెలంగాణ మాత్రమే కాకుండా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా కూడా ఈ రోజుని పురస్కరించుకుని జిల్లా స్థాయి అధికారులు వినియోగదారుల రక్షణ అవగాహన కోసం పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి చాలా ఘనంగా సమావేశాలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. పౌర సరఫరాల పరిధిలోకి వచ్చే వారు అంటే రైస్ మిల్లర్లు రేషన్ డీలర్ల ప్రతినిధులు ఎల్.పి.జి గ్యాస్ మరియు పెట్రోల్ బంకుల తరపున మరియు వాణిజ్య లేదా వ్యాపార మండలి( ఛాంబర్ ఆఫ్ కామర్స్) ప్రతినిధులతో పాటు వినియోగదారుల రక్షణ కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో ఆర్భాటంగా వినియోగదారుల రక్షణ చట్టం ఎప్పుడు వచ్చింది ఎలా వచ్చింది అనే విషయాలపై ఊక దంపుడు ఉపన్యాసాలు అయిపోగానే మళ్ళీ యధావిధిగా మనకు అలవాటైన కల్తీ ప్రపంచంలోకి వడివడిగా వెళ్ళిపోతాం. పొరుగు రాష్టంలో పదిహేడు మన తెలంగాణ రాష్ట్రంలో పన్నెండు జిల్లా వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మొత్తంగా ఇరవై తొమ్మిది జిల్లా స్థాయి డి.సి.డి.ఆర్.సి లు ప్రస్తుతం పని చేస్తున్నాయి. అయితే జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా సందర్భంగా ఆయా జిల్లా కేంద్రాలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొనే అధికారులు వ్యాపార సంస్థల ప్రతినిధులు మరియు వినియోగదారుల హక్కుల కోసం పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు లేదా సంస్థ సభ్యులలో యాభై శాతం మందికి పైగా అయా జిల్లాలలో ఉన్న జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్ల(డి.సి.డి.ఆర్.సి) కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియదనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. ఇందుకు అధికారులు కూడా మినహాయింపు కాదు. ఇలాంటి అంధకారమయమైన పరిస్థితులలో వినియోగదారులకు చట్టబద్ధంగా సంక్రమించిన హక్కులతో ప్రజలు నాణ్యమైన సేవలు పొందడానికి ఎలా వీలు కలుగుతుంది. ప్రతి ఏడూ ఒక సమావేశం తర్వాత దాని తాలూకు ఫోటోలు వార్తలతో వాట్సప్ ఫేస్ బుక్ లాంటి సోషల్ మీడియాలలో చేసే వీరంగం టీ కప్పులో తుఫాను లాంటిదే. దీని వలన ఎలాంటి ప్రయోజనాలు ఉండవు. ఇకనైనా తూ.తూ. మంత్రంగా అందరం ఒకేచోట గుమికూడి చేసే సమావేశాలకన్నా క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. ప్రకృతిని కాపాడుకుంటూ క్లీన్ ఎనర్జీ ట్రాన్సిషన్స్ ద్వారా వినియోగదారులను శక్తివంతం చేయడం అనే 2023 సంవత్సరపు ప్రపంచ వినియోగదారుల హక్కుల నినాదాన్ని ప్రతి గ్రామానికి పట్టణానికి చేరేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుందాం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలే అధికంగా మోసపోయే వినియోగదారులు కనుక ప్రతీ మారుమూల గ్రామాల్లో కూడా వినియోగదారుల రక్షణ చట్టం యొక్క అవసరాన్ని ఆవశ్యకతను దాని ఉపయోగాన్ని సవివరంగా నిరక్షరాస్యులైన ప్రజల్లోకి సహా తీసుకెళ్లాలని కోరుతూ అందరికీ జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవ శుభాకాంక్షలు.
(డిసెంబరు 24 జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా)



గంగాధర కిశోర్ కుమార్. ఆర్టీఐ కార్యకర్త
అంతర్జతీయ మానవ హక్కులు మరియు నేర నిరోధక సంస్థ శాశ్వత సభ్యులు
సెల్ నెం. 9652980975

## ఎంపీల సస్పెన్షన్ రాజ్యాంగ విరుద్ధమైన చర్య.

- ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్న బిజెపి ప్రభుత్వం.
- సస్పెన్షన్ ఎత్తివేసి దేశ ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలి.
- ప్రతిపక్ష పార్టీల జిల్లా నేతలు.
- సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, ఎంఎల్ పార్టీల ఆధ్వర్యంలో నిరసన.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),డిసెంబర్ 22,**పార్లమెంటులో 146 మంది ఎంపిలను ఊకుమ్మడిగా సస్పెండ్ చేయడం బిజెపి నిరంకుశ పాలనకు నిదర్శనమని, ప్రశ్నించే గొంతుకలు చట్టసభ నుంచి వెలివేసి హిట్లర్ తరహా పాలనను కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు అంతోటి పాల్, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కెచ్చల రంగయ్య, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకలు కందగట్ల సురేందర్ అన్నారు. 146 మంది ఎంపిలను పార్లమెంటు నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ వామపక్షాలు, కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం బస్టాండ్ సెంటరులో అమరవీరుల స్తూపం వద్ద ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించే విదంగా ఎంపిలను సస్పెండ్ చేసిందని విమర్శించారు. పార్లమెంటుపై దాడి చేసేందుకు పాసులు జారీచేసి ఎంపీని పార్లమెంటులో ఉంచి, ఈ చర్యలను ప్రశ్నించిన ఎంపిలను బయటకు గెంటివేయడ మేంటని ప్రశ్నించారు. ఇండియా కూటమి ఐక్యతను జీర్ణించుకోలేని బిజెపి ప్రభుత్వం పరోక్ష దాడులను పూనుకుంటోందని ఆరోపించారు. మోడీ ఫాసిస్టు పాలనను, అప్రజాస్వామిక, మతోన్మాద పాలనను అంతం చేసి ప్రజాస్వామ్యాన్ని గౌరవించే పాలన ఈ దేశానికి అవసరమని, రానున్న ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక, నిరంకుశ పాలనకు స్వస్తి చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ఎన్డీయే కూటమికి చరమగీతం పాడాలని, ఎంపీల సస్పెన్షన్ ఎత్తివేసి, దేశ ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని నేతలు డిమాండ్ చేశారు. అనంతరం అమరవీరుల స్తూపం నుంచి మధువన్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, భూక్యా శ్రీనివాస్, కె రత్నకుమారి,ఎస్ కె ఫహీమ్, సిపిఎం జిల్లా నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు, భూక్యా రమేష్, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, లక్ష్మి, స్వామి, వీరభద్రం, వీరన్న, ప్రజాపంథా, న్యూ డిమోక్రసీ పార్టీల జిల్లా నాయకులు మాచర్ల సత్యం, మల్లికార్జున్, బానోత్ కిషన్, భూక్యా రాజేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించిన ఈవో..



**సికే న్యూస్ యదాద్రి భువనగిరి ప్రతినిధి (సంపత్) డిసెంబర్ 22:**శనివారం నుండి ప్రారంభమయ్యే ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ సందర్భంగా శుక్రవారం ఆలయ ఈవో రామకృష్ణ ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కోసం ఉత్తర రాజగోపురం ముందు గల మాఢ వీధుల్లో తాత్కాలిక గ్రిల్స్ బిగించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో రానున్నందున ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించనున్నారు.

## ఆలేరు రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి పనులను పరిశీలించిన బీర్ల ఐలయ్య



**సి కే న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి (సంపత్) డిసెంబర్ 22 :**అలేరు పట్టణంలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి పనులను ప్రభుత్వం విప్ అలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శుక్రవారం రోజున పరిశీలించారు.ముందుగా ఆలేరు గెస్ట్ హౌస్ లో ఆర్ అండ్ బీ జిల్లా అధికారులతో రివ్యూ మిటింగ్ నిర్వహించారు.మండలాల్లో,గ్రామాల్లో,మున్సిపలిటిలో పెండింగ్ లో ఉన్న పనుల పై నూతన రోడ్లు, బ్రిడ్జిలపై చర్చించారు.ఈనెల 27వతేదీన ఆలేరు పట్టణ అండర్ పాస్ బ్రిడ్జి పనులు ప్రారంభిస్తారని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు.

# లిటిల్ ఫ్లవర్స్ లో గణిత శాస్త్ర పితమహుడు శ్రీనివాస రామానుజన్ జన్మదినోత్సవ వేడుకలు .





**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబర్ 22,**భారతదేశానికి చెందిన అపర గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల సందు గణిత శాస్త్ర వేడుకలు అట్టహాసంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమాన్ని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్ మాగంటి శ్రీనివాస వరప్రసాద్ మరియు మాగంటి రమేష్ బాబు మరియు జూనియర్ కాలేజి గణిత అధ్యాపకులు ఎండీ.బషీర్ ప్రారంభించారు. తర్వాత మాగంటి రమేష్ బాబు మరియు ఎండీ.బషీర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, రామానుజన్ గణితంలో సాధించిన విజయాలను గణిత శాస్త్ర అభివృద్ధికై చేసిన కృషిని వివరించారు. కావున కఠోర తపస్సుతో మనిషి అనుకున్నది సాధించగలడని దానికి శ్రీనివాస రామానుజన్ నిదర్శనమని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు వృత, త్రిభుజ ,దీర్ఘ చతురస్రాకారంలో నిలోచోని అబ్బుర పరచినారు. విద్యార్థులు చేసినటువంటి పాలిగన్స్ నమూనాలు, పైథాగరస్ సిద్ధాంతం, ప్రాబబిలిటీ, స్టాటిస్టిక్స్, వాస్తవ సంఖ్యలు, వైశాల్యము మరియు చుట్టుకొలత, త్రికోణమితి, సంభావ్యత, మొదలైన అంశాలపై ప్రాజెక్టులు ప్రదర్శించినారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయ బృందము, విద్యార్థినీ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు

# కేజీబీవీ లో ఘనంగా జాతీయ గణిత దినోత్సవం వేడుకలు

- విద్యార్థులు శ్రీనివాస్ రామానుజన్ స్ఫూర్తితో విద్యనభ్యసించాలి
- విద్యార్థులు గణితం పై ఆసక్తి కలిగి ఉండాలి
- పాలకుర్ల శివయ్య గౌడ్ ఫౌండేషన్ చే బహుమతులు ప్రధానం
- కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కంది భవాని



సికె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి (శ్రీనివాస్) డిసెంబర్ 22:విద్యార్థులు గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ స్ఫూర్తితో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కంది భవాని అన్నారు. ప్రఖ్యాత గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శుక్రవారం చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలను విద్యార్థులు పాలకుర్ల శివయ్య గౌడ్ ఫౌండేషన్ చైర్మన్ పాలకుర్ల మురళి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక నాయకులు బొంగు జంగయ్య గౌడ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీరాములు పాల్గొన్నారు. ముఖ్య అతిథులతో పాటు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కంది భవాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి శ్రీనివాస్ రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం విద్యార్థులు గణితానికి సంబంధించిన ప్రాజెక్టులను ప్రదర్శించి చూపించారు. అలాగే కూడికలు, తీసివేతలు సులభంగా అర్థమయ్యే రీతిలో చిన్ననాటిక ద్వారా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించి అతిథులచే ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీరాములు మాట్లాడుతూ విద్యార్థులు గణితం పై ఆసక్తి కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం ఫౌండేషన్ చైర్మన్ పాలకుర్ల మురళి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే గణితం పై ఆసక్తి కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థులంతా గణితం పై దృష్టి సారించి బాల మేధావులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కంది భవాని మాట్లాడుతూ చిన్ననాటి నుండే రామానుజన్ మాదిరిగా గణితంలో ప్రావీణ్యత అన్ని విషయాలలో సైతం అవగాహన ఏర్పడుతుందన్నారు. విద్యార్థులకు రామానుజన్ జీవిత విశేషాలను వివరించి ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సంపాదించినట్లయితే సాంస్కృతి కార్యక్రమాలలో గెలుపొందిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. అలాగే గణిత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కంది భవాని, పాలకుర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ చైర్మన్ పాలకుర్ల మురళి, బొంగు జంగయ్య గౌడ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీరాములు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పై అధికారులు ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి.

- పరిశీలించి పరిష్కారం న్యాయం చేయగలరు.
- జోగి యాదగిరి. లింగమ్మ కుటుంబ సభ్యులు ఆవేదన.



సి కె న్యూస్ వలిగొండ మండల ప్రతినిధి బాలరాజు డిసెంబర్ 22. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన జోగు యాదగిరి లింగమ్మ.

పత్రిక విలేకరులతో మాట్లాడుతూ.

మాకు ఇల్లు లేదు ప్రభుత్వం ఇచ్చిన సర్వే నెంబరు 336 లోరెండు గుంటల ప్లాటులో ఇల్లు నిర్మించుకుంటుంటే.

పక్క ఇల్లు జోగు అంజయ్య అబ్జెక్షన్ చెప్తున్నారని .

ఇల్లు ఇల్లుకు మధ్యన 3 ఫీట్ల సందు ఉండాలని. ప్రక్కన ఇల్లు బునాది. పారు పట్టి ఇల్లు కట్టుకోవాలని.

మీ ఇల్లుకు ఇరువైపులా సందు ఉండేటట్లు ఇల్లు నిర్మించుకోవాలని లేనిచో ఇల్లు నిర్మాణం ఆపాలని జోగు అంజయ్య మాట్లాడుతున్నారు .

దయచేసి పై అధికారులు ఎమ్మార్వో. ఎండిఓ. వలిగొండ ఎస్ఐ. మరియు ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి.

ఫీల్డ్ దగ్గరికి వచ్చి పరిశీలించి మాకు న్యాయం చేయాలని భార్యాభర్తలు మాట్లాడుతూ అధికారులను కోరినారు.

## ఖేలో ఇండియా రాష్ట్ర రగ్బీ పోటీలకు 48 మంది ఎంపిక



సి కె న్యూస్ చేగుంట రిపోటర్ కొండి శ్రీనివాస్ డిసెంబర్ 22:మెదక్ జిల్లా చేగుంట లోని ఆదర్శ పాఠశాల గ్రౌండ్ లో జరిగిన ఖేలో ఇండియా రగ్బీ అండర్ 14 అండర్,అండర్ 18, సీనియర్ క్రీడాకారిణుల ఎంపిక, జిల్లా నలుమూలల నుండి 100 మంది పైన క్రీడాకారుణిలు పాల్గొనగా, అందులో అత్యుత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారిణిలను ఎంపిక చేసినట్టు కోచ్ కర్ణం గణేష్ రవికుమార్ తెలిపారు.ఎంపికైన క్రీడాకారినిలు అండర్ 14 బాలికల విభాగంలో గాయత్రి, లాస్య, దివ్య, కావ్య, అక్షయ, రాణి కుమారి, వైష్ణవి, మాధురి, అంకిత, అనురాధ, ప్రియాంక, నందిని ఎంపికవుగా బీ–టీమ్ లో నవనీత, నిహారిక,గోవర్ధిని, నవత, స్వాతి, సుందరి, వర్ష, సోనియా, నందిని, అవంతిక, రేహన ఎంపికయ్యారు. జూనియర్ అండర్ 18 విభాగంలో శిరీష ,జ్యోతి, సుజాత, అనిత, పూజ, దివ్య, నిఖిత,కళ్యాణి, శైలజ, పింకీబాయ్, నికిత, సింధుజ ఉన్నారని, సీనియర్ మహిళల విభాగంలో నందిని, భబిత, అఖిల, సంజుల, గీతాంజలి, రజని,జయత,వనజ,మౌనిక,మల్లీశ్వరి ఎంపికయ్యారని కోచ్ తెలిపారు.ఎంపికైన అండర్ 18,సీనియర్ మహిళల జట్లు 23 వ తేదీన అండర్ 14 బాలికల జట్లు 24 వ తేదీన సికింద్రాబాద్ లోని ఆర్.ఆర్,సి గ్రౌండ్ సౌత్ సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఉదయం 6 గంటల 30 నిమిషాల వరకు రిపోర్ట్ చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ రగ్బీ రెఫరీ కర్ణం మల్లీశ్వరి,జిల్లా పీటిల అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, పీడీలు శారద, వెంకటేష్, మంజుల, నర్సింలు పీఈటీ బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు మారెళ్ళ మల్లికార్జునరావు



ఖమ్మం జిల్లా తల్లాడ మండలం సీకే న్యూస్ రిపోర్టర్ :విజయ్ డిసెంబర్ :22, తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన కటుకూరి జోజి, చిట్టెమ్మ దంపతుల కుమారుడు రమేష్, మమత దంపతుల కుమారుడు రితిక్ అన్నప్రసన్న వేడుక శుక్రవారం గ్రామంలోని సాయిబాబా కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ మారెళ్ళ మల్లికార్జునరావు, మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్ హాజరై చిన్నారికి అక్షింతలు వేసి దీవించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## తల్లిని హత్య చేసిన కేసు లో కుమారునికి జీవిత ఖైదు.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబర్ 22,తల్లిని హత్య చేసిన కేసు లో కుమారునికి జీవితాఖైదు విదిస్తూ కొత్తగూడెం ప్రధాన జిల్లా న్యాయమూర్తి పాటిల్ వసంత్ శుక్రవారం తీర్పు చెప్పారు. 26-12-2020 న భద్రాచలం కు చెందిన యర్రంశెట్టి వెంకట రత్నం నాయుడు తన పిర్యాదు లో తాను వ్యాపారనిమిత్తం షాపుకు వెళ్ళేటప్పుడు వచ్చేప్పుడు తన తల్లి పార్వతమ్మ (65)ను పలుకరించి వెళ్ళేవాడినని 24-12-2020 న కుడా మాట్లాడి వెళ్లానని తెల్లవారి వచ్చి చూసేసరికి తన మంచం నుంచి క్రింద పడి చనిపోయి ఉందని ఎవరి పై అనుమానం లేదని అప్పటి భద్రాచలం టౌన్ ఎస్. ఐ. వి. వెంకటేశ్వరరావు కు పిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, ఎఫ్. ఎస్. ఎల్. రిపోర్ట్ లో చంపినట్లు గా రాగ, దర్యాప్తు లో తన తమ్ముడు చంపినట్లుగా, తన తమ్ముడు యర్రంశెట్టి శ్రీనివాసరావు తన భార్య, కూతురి ముందు తన తల్లి పార్వతమ్మ ఇచ్చిన డబ్బులు అడిగిందుకు కక్ష పెంచుకొని, తల్లి ఇంటికి వెళ్లి, చంపి బంగారు ఆభరణాలు, ప్రామిస్సరీ నోట్ తీసుకొని వెళ్ళాడని వాటిని రికవరీ చేసారని అప్పటి ఇన్స్పెక్టర్ టి. స్వామి ఛార్జ్ షీట్ కోర్ట్ లో దాఖాలు చేశారు. కోర్టు లో 19 మంది సాక్షులను విచారించారు. శ్రీనివాస రావు పై నేరం రుజువు అయినదని, కోర్ట్ లో జీవిత ఖైదు,6 వేయిల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.ప్రాసెక్యూషన్ ను పబ్లిక్ ప్రాసెక్యూటర్ పోసాని రాదా కృష్ణ మూర్తి నిర్వహించారు. లైజన్ ఆఫీసర్ ఎన్. వీరబాబు కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ (పి. సి.)సుధీర్ బాబు లు సహకరించారు.

## కొత్తూరు మండలం పెంజర్లలోని అనంత పద్మనాభ స్వామివారి దేవాలయం వైకుంఠ ఏకాదశికి ముస్తాబు

- శనివారం ఉదయం 6:48 నిమిషాలకు ఆలయ ఉత్తర ద్వారం గుండా స్వామిదర్శనం
- పాలకవర్గ చైర్మన్ బెజవాడ అనిత రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు
- మధ్యాహ్నం 12:30 నిమిషాలకు అన్నదాన కార్యక్రమం



శేఖర్ గౌడ్ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం డిసెంబర్ 21:(సి కే న్యూస్)కొత్తూరు మండలంలోని పెంజర్ల గ్రామంలో స్వయంభుగా వెలిసిన అనంత పద్మనాభ స్వామి దేవాలయంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ఆలయ కమిటీ చైర్మన్,మరియు ఆలయ కమిటీ పాలకవర్గ సభ్యులు దేవాలయాన్ని ముస్తాబు చేశారు.శనివారం ఉదయం 6:48 నిమిషాలకు ఆలయ ఉత్తర ద్వారం గుండా స్వామి వారు దర్శనమిస్తారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని దేవస్థానం వారు ఏర్పాటు చేస్తున్న ఉచిత అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించగలరని పాలకవర్గ చైర్మన్ బెజవాడ అనిత రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

## కనకబోయిన నాగరాజు ఆద్వర్యంలో దివ్యాంగుల సమావేశం...

ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ గుత్తికొండ..



సి కే న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి (సంపత్) డిసెంబర్ 22:తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి యాదాద్రి జిల్లా అధ్యక్షులు కనకబోయిన నాగరాజు ఆద్వర్యంలో భువనగిరి పట్టణంలో దివ్యాంగుల సమావేశం నిర్వహించడం జరిగింది..ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ గుత్తికొండ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు..ఈ సమావేశంలో టి వి హెచ్ ఎస్ ఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండ జహంగీర్,జిల్లా ప్రధాన కార్యదర్శిగ మీసాల సుధాకర్,జిల్లా మహిళ అధ్యక్షురాలిగా మీసాల శోభ మరియు రాజాపేట మండల అధ్యక్షులుగా ఇప్పల రమేశ్, గారిని బొమ్మలరామరం అధ్యక్షులుగా తుమ్మల రవి, నుతన మండల అధ్యక్షులను ఎన్నుకోవటం జరిగింది.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మెరుగు శివ పాల్గొన్నారులి

# మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- ఎమ్మెల్యే శంకర్ కు కార్మికుల వినతి అందజేత



శేఖర్ గౌడ్ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం డిసెంబర్ 21:(సి కే న్యూస్ )షాద్ నగర్ నియోజకవర్గ మిషన్ భగీరథ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు వినతి పత్రం అందజేశారు శుక్రవారం కమ్మదనంలోని మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని ఎమ్మెల్యే శంకర్ సందర్శించారు ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు గత ప్రభుత్వం తమను పట్టించుకోలేదని కనీస వేతనాలు అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు చాలీచాలని వేతనాలను సైతం సకాలంలో అందించలేదని వేతనాల కోసం ఏడాది పొడవునా వేచి చూడాల్సిన దుస్థితి నెలకొందని కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం చేయాలని సమాన పనికి సమాన వేతనం అందించడంతోపాటు పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించి తమకు న్యాయం చేయాలని కోరారు కార్యక్రమంలో షాద్ నగర్ నియోజకవర్గ మిషన్ భగీరథ కార్మికులు పాల్గొన్నారు...

## కాలనీ నూతన కమిటీ ఎన్నిక



సి కె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి (శ్రీనివాస్)డిసెంబర్ 22:చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడిపల్లి రోడ్డు 16వ వార్డులో వినాయక నగర్, సాయి నగర్ కాలనీల నూతన కమిటీ ఎన్నికను శుక్రవారం ఏకగ్రీవం ఎన్నుకోవడం జరిగింది. కాలనీ అధ్యక్షులుగా కంభంపాటి నరసింహ గౌడ్ రిటైర్డ్ బిఎస్ఎన్ఎల్ అధికారి, ప్రధాన కార్యదర్శిగా నోముల రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సుర్వి కిరణ్ కుమార్ గౌడ్, కోశాధికారిగా పంతంగి సోమరాజు గౌడ్, కార్యదర్శిగా సంఘం స్వామి, సహాయ కార్యదర్శిగా ఎర్రోజు యజ్ఞమాచారి, సంస్కృత కార్యదర్శిగా బడేటి లింగస్వామి గౌడ్, గౌరవ సలహాదారులుగా సామకూర యాదయ్య, దేశ గొని శ్రీశైలం గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా బొంగు స్వామి గౌడ్, నిమ్మల అర్జున గౌడ్, బొలమోని రాములు లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.


## మహాత్మ జ్యోతిబాపూలే లో ఘనంగా జాతీయ గణిత దినోత్సవం వేడుకలు

- విద్యార్థులు గణితం పై ఆసక్తి కలిగి ఉండాలి
- ఏటీపీ పి ప్రవీణ్ కుమార్



సి కె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి (శ్రీనివాస్)డిసెంబర్ 22:ప్రఖ్యాతగణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శుక్రవారం కొత్తగూడెం మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలను విద్యార్థులు ఏటీపీ ప్రవీణ్ కుమార్, గణిత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి శ్రీనివాస్ రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు గణితానికి సంబంధించిన ప్రాజెక్టులను ప్రదర్శించి చూపించారు. అలాగే కూడికలు, తీసివేతలు సులభంగా అర్థమయ్యే రీతిలో చిన్ననాటిక ద్వారా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించి అతిథులచే ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఏటీపీ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు గణితం పై ఆసక్తి కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే గణితం పై ఆసక్తి కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థులంతా గణితం పై దృష్టి సారించి బాల మేధావులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సాంస్కృతి కార్యక్రమాలలో గెలుపొందిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. అలాగే గణిత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అసైన్మెంట్ భూమి.వికరిస్తున్న వారిపై చర్య తీసుకోవాలని ఆ.భూమి యజమాని .ఫిర్యాదు



సి కె న్యూస్ చేగుంట రిపోర్టర్ కొండి శ్రీనివాస్ డిసెంబర్ 22:పట్టా సర్వే నెంబరు వేసి అసైన్మెంట్ భూమి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకొనుట కొరకై తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డికి ఫిర్యాదు చేయడమైనది. గతంలోనూ చేగుంట తహసిల్దార్ కార్యాలయంలోనూ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు ఇది న్యూస్ కవర్ చేయగలరు థాంక్యూ

# అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యేను అవమానించిన అక్బరుద్దీన్ ఓవైసీ వెంటనే క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ ఎస్సి సెల్ డిమాండ్




**సీ కే న్యూస్ భువనగిరి ప్రతినిధి (శ్రీలత) డిసెంబర్ 22:**నిన్న జరిగిన తెలంగాణ అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గారిని మొదటిసారి గెలిచిన బచ్చా అని సంబోధించి అవమానించిన మజ్లీస్ పార్టీ నేత అక్బరుద్దీన్ ఓవైసీ వెంటనే దళిత జాతికి క్షమాపణ చెప్పాలని యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సి విభాగం అధ్యక్షులు దర్గాయి హరి ప్రసాద్ డిమాండ్ చేశారు. సందర్భంగా మాట్లాడుతూ ఎంఐఎం పార్టీ బిఆర్ఎస్ పార్టీ పార్టీకి వత్తాసు పలుకుతూ రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పిన కూడా బుద్ధి మార్చుకోలేక అహంకారంతో ఓర్వలేని తనంతో బలుపుతో నూతనంగా శాసనసభకు వచ్చిన ఉన్నత విద్యావంతుడు దళిత జాతికి చెందిన డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గారిని పట్టుకొని బచ్చా అని సంబోధిస్తూ అవమానపరచడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రస్తుత శాసనసభలో 57 మంది నూతన ఎమ్మెల్యేలు అడుగుపెట్టారని వారందరినీ కూడా అక్బరుద్దీన్ ఓవైసీ అవమానించినట్టేనని ముస్లిం పార్టీ ముసుగులో ముస్లింలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ఎంఐఎం పార్టీ కామారెడ్డిలో షబ్బీర్ అలీ కి వ్యతిరేకంగా జూబ్లీహిల్స్ లో దేశానికి అంతర్జాతీయంగా ఖ్యాతి తెచ్చిన క్రీడాకారుడు అజారుద్దీన్ కు వ్యతిరేకంగా 50 కోట్లు పెట్టి ఓడించిన ఘనత ఎంఐఎం పార్టీ ఓవైసీ సోదరులకు దక్కుతుందని బీహార్ ఉత్తరప్రదేశ్ మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో బిజెపి గెలుపుకు పరోక్షంగా పనిచేసి కేంద్రంలో బిజెపి పార్టీకి రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీకే మద్దతు పలుకుతున్న ఎంఐఎం పార్టీ ఆగడాలలో విధానాలను తెలంగాణ రాష్ట్రంలోని ముస్లిం ప్రజలు గమనిస్తున్నారని రాబోవు అన్ని ఎన్నికల్లో ఎంఐఎం పార్టీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఇటీవల నాంపల్లి, బహదూర్ పుర అసెంబ్లీ ఎన్నికల ఓట్ల శాతమే దీనికి నిదర్శనమని అన్నారు. ముస్లింలను రాష్ట్రపతి, ముఖ్యమంత్రిలు, పార్టీ అధ్యక్షులుగా చేసిన ఘనత వారికి నాలుగు శాతం రిజర్వేషన్లు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ ,మాజి మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, కౌన్సిలర్ ఈరపాక నరసింహ,ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నాగారం శంకర్,సేవాదళ్ జిల్లా అధ్యక్షులు పిట్టల బాలరాజ్,కొల్లురి రాజు, సిరికొండ శివకుమార్, గ్యాస్ చిన్నా, కాల్య నాగరాజు,డాకూరి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు

## ఆలేరు జామియా మస్జీద్ సర్వసభ్య సమావేశం లో నూతన కమిటీ ఎన్నిక....

- అధ్యక్షుడిగా ఎండి అజ్మత్ పాషా...
- ఉపాధ్యక్షులుగా ఎండి బద్రుద్దీన్,ఎండి మహమ్మద్ పాషా......



**సి కే న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి (సంపత్) డిసెంబర్ 22 :**ఆలేరులో జామియా మస్జీద్ సర్వసభ్య సమావేశం శుక్రవారం రోజున నిర్వహించడం జరిగింది.సభ్యులు ఇందులో ముస్లిం మైనార్టీలు (అవ్వామ్) పాల్గొని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది..నాలుగు మస్జీద్ లకు గాను జామియా మస్జీద్ ఇంతెజామీ కమిటీ ఆలేరు,సభ్యులను ఎన్నుకున్నారు.ఇందులో అధ్యక్షుడిగా ఎండి అజ్మత్ పాషా,ఉపాధ్యక్షులు గా యండి బద్రుద్దీన్,ఎండి మహమ్మద్ పాషా,జనరల్ సెక్రెటరీ ఎండి రఫీ,కోశాధికారి ఎండి అలీమ్, సెక్రెటరీ ఎండి అప్సర్,ఎండి మహమ్మద్(మిర్చి),ఎండి చాంద్ పాషా,ఎండి మక్బూర్ (మెకానిక్),సలహాదారులు ఎండి సలీం (వెహికల్ బిజినెస్), ఎండి మొహమ్మద్(ఏ ఎల్ ఎం), సభ్యులు ఎండి రహమత్ ( హోటల్),ఎండి యాసిన్ (యక్స్ టైలర్),ఎండి ఫిరోజ్ (అమీన మస్జీద్),ఎండి సాదిబ్( బీసీ కాలనీ),ఎండి యాకూబ్,ఎం ఖాలిద్,ఎండి నజీర్ (జె ఎల్ ఎం), ఎండి సాజిద్(బేకరీ) ఆలేరు మైనార్టీలు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులు హర్షం వ్యక్తం చేశారు...

## అప్రజా స్వామీకంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంట్లో 141 మంది ఇండియా కూటమికి చెందిన ఎంపీలను పార్లమెంట్ పై దాడి చేసిన సంఘటనపై బిజెపి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఎంపీల సస్పెన్షన్




**సీ కే న్యూస్ భువనగిరి ప్రతినిధి (శ్రీలత) డిసెంబర్ 22:**భువనగిరి పట్టణ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అప్రజాస్వామికంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో 141 మంది ఇండియా కూటమికి చెందిన ఎంపీలను పార్లమెంటుపై దాడి చేసిన సంఘటనపై బిజెపి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఎంపీలను సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది

## మృతుని కుటుంబానికి అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

- మృతుని కుటుంబానికి 33,500 ఆర్థిక సహాయం అందజేత
- 100 కేజీల బియ్యం అందజేత



**సి కె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి (శ్రీనివాస్)డిసెంబర్ 22:**చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు లక్కారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాశం పెద్ద శ్రీనివాస్ కొద్ది రోజుల క్రితం అకాల మరణం చెందారు.మృతుని కుటుంబానికి ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరూ కలిసి 33,500 రూపాయల ఆర్థిక సహాయం తో పాటు 100 కేజీల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు ఎవరికి ఏ ఆపద వచ్చినా కూడా అందరూ కలిసి ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ముందు ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, స్థానిక కౌన్సిలర్ కొయ్యడ సైదులు గౌడ్, 7వ వార్డు అధ్యక్షులు పాశం చిన్న శ్రీనివాస్, 8వ వార్డ్ అధ్యక్షులు లందగిరి యాదయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, గుండబోయిన రవికుమార్ యాదవ్ ,మాజీ ఉపసర్పంచ్ గొడుగు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి బద్రి బాలరాజ్ ,యువజన కాంగ్రెస్ నాయకులు గోపనబోయిన మహేష్ యాదవ్ ,దోమ్మాటి దయాకర్ రెడ్డి, బద్రి గా, పాలెం సుమన్ గౌడ్, పాశం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీల సస్పెన్షన్ పై మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు






- ఇందిరా చౌక్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపిన మంత్రులు ఎమ్మెల్యేలు
- కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని హత్య చేస్తూ రాచరిక పాలనను నడిపిస్తుంది
- ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా ? అంటూ ఆవేదనా వ్యక్తం చేసిన మంత్రి జూపల్లి
- భద్రత వైఫల్యం పై కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి ?
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**సీ కే న్యూస్ ప్రతినిధి సులిగిరి తరుణ్ / కొల్లాపూర్ :**పార్లమెంట్ లో ఎంపీల సస్పెన్షన్ లను నిరసిస్తూ ఇందిరా చౌక్ లో ధర్నా నిర్వహించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ దేశ పార్లమెంట్ లో జరిగిన భద్రత వైఫల్యం పై కేంద్ర హోం శాఖ మంత్రిని విపక్ష పార్టీలకు చెందిన ఎంపీ లు ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా ఎంపీ లను సస్పెండ్ చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ శుక్రవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఇందిరా చౌక్ లో జరిగిన నిరసన కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని బీజేపీ ప్రభుత్వ వైకరిని ఖండించారు ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ దేశ పార్లమెంట్ లో ఎంపీ లకే భద్రత లేకుంటే సామాన్య ప్రజలకు ప్రభుత్వం ఎలా రక్షణ కల్పిస్తుందని ప్రశ్నించారు సంఘటనను ప్రశ్నించిన పార్లమెంట్ సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేస్తూ తీసుకున్న నిర్ణయం సరైనది కాదు అని అన్నారు పార్లమెంట్ లో జరిగిన భద్రత వైఫల్యం పై కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు,ఎమ్మెల్యే లు పిసిసి ముఖ్య నాయకులు,తెలంగాణ ఉద్యమ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## రేపు సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో మంత్రి పొంగులేటి పర్యటన

**హుజూర్ నగర్ లో మరో మంత్రి ఉత్తమ్ తో కలిసి గృహ నిర్మాణ శాఖ సమీక్ష అనంతరం ఖమ్మంకు..**



**సికె న్యూస్ ప్రతినిధి,ఖమ్మం:** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో పర్యటిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ చేరుకుంటారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ సమీక్ష నిర్వహిస్తారు.

మధ్యాహ్నం 3: 45 గంటలకు.. కూసుమంచి చేరుకుంటారు. అక్కడి మల్లారెడ్డి ఫంక్షన్ హాల్లో క్రిస్మస్ కానుకలు, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి..: ఖమ్మంలోని తన క్యాంప్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. ఈ మేరకు క్యాంప్ ఆఫీస్ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

## నూతన హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గాదెల సుధారాణి రత్న ప్రభాకర్ రెడ్డి





**సీ కే న్యూస్ ప్రతినిధి సులిగిరి తరుణ్ / కొల్లాపూర్ :** చారిటబుల్ ట్రస్ట్ అదినేత్రి గాదెల సుధారాణి రత్న ప్రభాకర్ రెడ్డి కొల్లాపూర్ నియోజకవర్గంలోని పాన్ గల్ మండలం రేముద్దుల గ్రామంలో నూతన లక్ష్మీ దేవి హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమనికి

ఆ గ్రామ సర్పంచ్ సుజాత తిరుపతయ్య ఆహ్వానం మేరకు ఆ గ్రామంలోని పది పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న గాదెల సుధారాణి రత్న ప్రభాకర్ రెడ్డి గ్రామంలో ఇలాంటి అభివృద్ధికి సహకరించిన లక్ష్మీ దేవి హాస్పిటల్ యాజమాన్యానికి వారు శాలువాతో సత్కరించడం జరిగింది అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాలలో కూడా హాస్పిటల్స్ ఉండడం చాలా ముఖ్యమని గ్రామంలోని ప్రతి ఒక్కరికి మంచి వైద్యం అందిస్తూ మరింత అభివృద్ధి చెందుతూ ముందుకు సాగాలని ఈ సందర్భంగా ఆమె మాట్లాడటం జరిగింది అలాగే గ్రామంలోని ప్రజలందరూ కూడా ఈ యొక్క హాస్పిటల్ ని వినియోగించుకుని ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె గ్రామ ప్రజలకు తెలిపారు అలాగే వైద్యులు కూడా ప్రజలపై ప్రత్యేక దృష్టితో వైద్యం అందించాలని ఈ సందర్భంగా ఆమె వారిని కోరారు ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ నియోజక వర్గ ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

**నూతన వధూవరులను ఆశీర్వదించిన "గాదెల సుధారాణి రత్న ప్రభాకర్ రెడ్డి"**

కొల్లాపూర్ మండలం మాచినేని పల్లి గ్రామం లో పూర్ణ కంటి రాములమ్మ పూర్ణ కంటి చంద్రయ్య ల ఆహ్వానం మేరకు శుక్రవారం పవన్ కళ్యాణ్ పల్లవి మాధవి ల వివాహానికి హాజరైన గాదెల సుధారాణి రత్న ప్రభాకర్ రెడ్డి అనంతరం నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆయురారోగ్యలతో అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆమె వారిని ఆశీర్వదించారు

# నమ్మకాన్ని నిలబెట్టుకునేలా వ్యాపారం చేయాలి: మంత్రి పొంగులేటి

**సికె న్యూస్ ప్రతినిధి హైదరాబాద్:**స్వీట్‌హోం ఎక్స్‌పోను రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపారస్తులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బంది పెట్టబోదు అని హామీ ఇచ్చారు. వ్యాపారస్తులంతా నమ్మకాన్ని నిలబెట్టుకునేలా వ్యాపారం చేయాలని సూచించారు. రీజనల్ రింగ్ రోడ్డు దగ్గర పరిశ్రమల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఫార్మాసిటీకి బదులు ఐటీ కంపెనీలతో మెగాసిటీ నిర్మిస్తామన్నారు. అంతేకాదు.. మెగాసిటీకి మెట్రోను అనుసంధానిస్తామని హామీ ఇచ్చారు. 3 రోజుల పాటు హైటెక్ సిటీలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరుగుతోంది. ఆకర్షనీయమైన ఇంటీరియర్, ఫర్నీచర్ మరియు అద్భుతమైన హెూం డెకరేషన్ డిజైన్స్ కూడా వినియోగదారులకు అందుబాటులో ఉంచింది. ఈ స్వీట్‌హోంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు తమ స్టాల్స్‌ని ఏర్పాటు చేశాయి. హైటెక్స్‌లో 3 రోజుల పాటు జరుగుతున్న ఈ ఎక్స్‌పోకి ప్రవేశం ఉచితం.





## ల్యాండ్ సర్వేయర్ అడ్మిషన్లు చివరి తేదీ నేడే 2023 -24 విద్యా సంవత్సరానికి తెలంగాణ స్టేట్ ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ ద్వారా వృత్తి విద్య సర్టిఫికెట్ కోర్సులకు అడ్మిషన్ల కి నేడే చివరి తేదీ

తేదీ చివరి తేదీ 23/12/2023 తో ముగింపు

కోదాడ లక్ష్య ఎడ్యుకేషన్ అకాడెమీ కోఆర్డినేటర్ అనంతుల సతీష్



**కోదాడ సీకే న్యూస్ రిపోర్టర్ :**శుక్రవారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. తమ అకాడమీ లో కొర్సులు ల్యాండ్ సర్వేయర్(6నెలలు) ,బ్యూటిషన్ (3నెలలు), ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్(9నెలలు) ,కోర్స్ కోర్సులకువిద్య సంవత్సరానికి అడ్మిషన్లు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.ఈ అవకాశాన్ని నిరుద్యోగులు విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదో తరగతి పాసైన వారు, ఆ పై చదివిన వారందరికీ అవకాశం ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ల్యాండ్ సర్వేర్ కోర్సులకు బ్యూటిషన్ మరియు ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ కోర్సులకు మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. స్వల్పకాలిక వృత్తి విద్య కోర్సులకు ప్రవేశాలు విడుదల

ప్రభుత్వ గుర్తింపు పొందిన ఇంటర్మీడియట్ బోర్డు ద్వారా సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తెలిపారు. స్వల్పకాలిక కోర్సులు పూర్తిచేసి ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థలు ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. అడ్మిషన్ కావాలనుకున్నవారు అడ్మిషన్ల కి చివరి డిసెంబరు 23 వరకు చివరి తేదీ మరిన్ని వివరాలకు లక్ష్యా డిస్టెన్స్ అకాడమీ నయానగర్ ,కోదాడ ,బ్రిలియంట్ స్కూల్ పక్కన ఫోన్ నంబర్లకు 9542107771 , 7981528312 సంప్రదించాలని కోరారు.

## బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్ లో ఘనంగా శ్రీనివాస రామానుజన్ వేడుకలు....

రామానుజన్ నంబర్ తో కళాకృతి లో పిల్లలు ప్రదర్శన...






**కోదాడ సీకే న్యూస్ రిపోర్టర్ :**కోదాడ పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్ లో ఘనంగా శ్రీనివాస రామానుజన్ %ళి%నేషనల్ మాథ్స్ డే%రి% జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది . గణితం మన జీవితంలో ఒక భాగంగా ఉంది.

గణిత శాస్త్రంలో శ్రీనివాస రామానుజన్ చేసిన సేవల గురించి పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ పి ఎస్ ఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. శ్రీనివాస రామానుజన్ జీవితం మొత్తం గణిత పరిశోధన కోసం అంకితం చేయడం జరిగింది. ఆయన వ్యక్తిత్వం ఆయన కృషి, పట్టుదల, అంకిత భావం నేటి తరం విద్యార్థులు అలవారుచుకోవాలి అని ఆయన అన్నారు..ఆయన స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి అని అన్నారు.. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాద్యాయులు గరిడేపల్లి రమేష్,యరగాని అంజయ్య ,ఉపేందర్ ,నరేష్ ,హసీనా మరియు తోటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన అన్నారుగూడెం కాంగ్రెస్ నాయకులు

**ఖమ్మం జిల్లా తల్లాడ మండలం సీకే న్యూస్ రిపోర్టర్ : విజయ్, డిసెంబర్ :22**

అన్నారుగూడెం మాజీ ఎంపిటిసి తాళ్ల జోసెఫ్ మేనల్లుడు, విప్పల మడక గ్రామానికి చెందిన బూరుగు లాజరు, భారతి దంపతుల కుమారుడు రమేష్ కు గోపాలపేట గ్రామానికి చెందిన తాళ్ల వెంకటేశ్వర్లు, సులోచన దంపతుల కుమార్తె కల్పనాతో శుక్రవారం వైరా మండలం ఉప్పల మడక గ్రామంలో వివాహం జరిగింది. ఈ కార్యక్రమానికి అన్నారుగూడెం కాంగ్రెస్ పార్టీ నాయకులు మారెళ్ళ మల్లికార్జున రావు, పొన్నం కృష్ణయ్య, తాళ్ల జోసెఫ్ హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి దీవించారు. పిల్లాపాపలతో హాయిగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మారెళ్ళ కోటేశ్వరరావు, మారెళ్ళ రఘు, తాళ్ల ఆగస్టన్, ఉప్పలమడక సర్పంచ్ బూరుగు జాన్ పాపయ్య, యాకోబు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ తల్లాడ మండల అధ్యక్షులు తాళ్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



# మండలం లో కొనసాగుతున్న వికసిత భారత్ సంకల్పయాత్ర ప్రచారం

**అనంతగిరి, సీకే న్యూస్ రిపోర్టర్:**ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భగవాన్ బిర్సా ముండా జయంతి నుండి జనవరి 26 2024 వరకు నిర్వహించ తలపెట్టిన వికసిత భారత్ సంకల్ప యాత్ర మన రాష్ట్రంలో డిసెంబర్ 16 నుండి ప్రారంభించడం జరిగింది. ఈ యాత్ర ను రాష్ట్రంలోని అన్ని గ్రామాలను మరియు పట్టణాలను కలుపుకొని నిర్వహించడం జరుగుతుంది. దీనిలో భాగంగా అనంతగిరి మండలం పాలవరం గ్రామంలో నిర్వహించిన ఈ యాత్రలో భాగంగా ఈ కార్యక్రమంలో %ూదీ×% రీజనల్ మేనేజర్ జ్యోతి , లీడ్ బ్యాంకు మేనేజర్ బాపూజీ ,

%ూదీ×% త్రిపురవరం బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు, కామన్ సర్వీస్ సెంటర్ అసిస్టెంట్ మేనేజర్ చరణ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను చిట్ట చివరి బీద ప్రజల వరకు చేరాలని అలా చేరి వారు ఆయా పథకాలను వినియోగించుకొని తమ సాంఘిక ఆర్థిక స్థితులను పెంపొందింప చేసుకోవాలని ప్రధాని మోడీ ఈ యొక్క శతభారత్ సంకల్ప యాత్రను ప్రారంభించారని, వారి



సంకల్పాన్ని నెరవేర్చి తద్వారా 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచ దేశాలలో ఉన్నతస్థితిలో నిలపాలనే ఉద్దేశ్యం తో దానికోసం మనమందరం మన విధులను సక్రమంగా నిర్వహిస్తూ వారికి సహకరించుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కోదాడ అసెంబ్లీ కన్వీనర్ కనగాల లక్ష్మీనారాయణ ,

%జఖీూ% చింతకుంట్ల సతీష్,

చిలుముల అశోక్, %జూజ% నిర్వహకుడు దొప్ప మాధవరావు మరియు వివిధ సంక్షేమ పథకాల అమలు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఎండి అక్బర్ పుట్టినరోజు సందర్భంగా కోదాడలో బ్లడ్ డొనేషన్ నిర్వహించారు.




**కోదాడ సీకే న్యూస్ రిపోర్టర్ :**సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని ముత్యాలమ్మ గుడి ఆవరణలో ఎండి అక్బర్ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్య అతిథులుగా కోదాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వంగవీటి రామారావు,కోదాడ పట్టణ మున్సిపాలిటీ కౌన్సిలర్ కందుల కోటేశ్వరరావు, కౌన్సిలర్ షాబుద్దీన్ పాల్గొన్నారు. అక్బర్ స్నేహితుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బర్త్డే సెలబ్రేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు వందమంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారికి పండ్లు, జ్యూస్ పంపిణీ చేయడం జరిగింది. తధానంతరం విజయవాడ రోడ్డులో గల శనగల రాధాకృష్ణ అనాథ ఆశ్రమంలో పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎండి అక్బర్ మాట్లాడుతూ, పుట్టినరోజు సందర్భంగా బ్లడ్ డొనేషన్, అనాథ ఆశ్రమంలోని పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో దగడు సాయి, సుమంత్,స్నేహితులు పాల్గొన్నారు.

# నిరుపేదలకి అండగా జై భీమ్ యూత్ సభ్యులు..



**కోదాడ సీకే న్యూస్ రిపోర్టర్ :**నిరుపేదలకి అండగా జై భీమ్ యూత్ సభ్యులు.గడుస్తున్న కాలంతోపాటు మనం కూడా ముందుకు సాగాలని దృఢ సంకల్పంతో కోదాడ పట్టణంలోని11 వ వార్డు కొమరబండ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన రాజేష్ కుటుంబానికి మరియు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న మరికొన్ని కుటుంబాలకు నిత్యావసరాల సరుకులు పంపిణీ %ణతీ.+%. నవీన్ అధ్వర్యంలో చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లేపల్లి సుమన్ మరియు జై భీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

# కశ్మీరు నేలను గెలిచారు.. హృదయాన్ని ఎవరు గెలవాలి!

“కశ్మీర్‌ను ఆధ్యాత్మిక ఔన్నత్యంతోనే జయించగలం. సైనిక బలంతో ఎప్పటికీ జయించలేం” ... దాదాపు 900 ఏళ్లనాడు కశ్మీర కవి కల్హణుడు అన్న మాటలవి. 75 ఏళ్ల ఆధునిక కశ్మీరు చరిత్రలో ఆధ్యాత్మిక ఔన్నత్యం అంతంత మాత్రంగా, బలప్రయోగం కొండొంత మాత్రంగా కనపడుతోంది. అందుకే జన హృదయాలపై గెలుపు దక్కటం లేదు. ఆర్టికల్ 370ని రద్దుచేయటంతో కశ్మీరులో కొత్త అధ్యాయం మొదలవుతుందన్న ఉహాగానాలు చాలా వచ్చాయి. సుప్రీంకోర్టు ఇటీవల ఆ రద్దుని సమర్థించటంతో ప్రధాన రాజకీయ స్రవంతిలో కశ్మీరు కరిగి పోతుందన్న ప్రకటనలు కోకొల్లలుగా వచ్చాయి. ఏ బలగాలను దృష్టిలో పెట్టుకుని కల్హణుడు ఆ మాటలు అన్నాడో కచ్చితంగా చెప్పలేకపోయినా ఒకటి మాత్రం స్పష్టం. అప్పటికి కశ్మీరుకు ముస్లిం దాడుల భయం లేదు. హిందూ రాజులను దృష్టిలో ఉంచుకునే కల్హణుడు ఆ వ్యాఖ్యలు చేసి ఉంటాడు. అప్పటికే కశ్మీరు సాంస్కృతికంగా కొంత విశిష్టతను సంతరించుకుంది. 1100ల నాటికి దేశవ్యాప్తంగా స్థానిక భాషల ఆధిక్యత ఆరంభమైంది. ఆ భాషల్లో సాహిత్య సృష్టి మొదలైంది. నన్నయ్య తెలుగు మహాభారత రచనే ఇందుకు నిదర్శనం. పలు రాష్ట్రాల ప్రత్యేక అస్తిత్వానికి అవసరమైన పునాదులు స్థానిక భాషలతోనే మొదలయ్యాయి. విశిష్ట భాష, సంస్కృతి లేకపోతే రాష్ట్రాల ఏర్పాటు వాదనలే తలెత్తేవి కావు. సంస్కృతులు ఎప్పుడూ ఆధ్యాత్మిక ఔన్నత్యాలకే ప్రభావితం అవుతాయి. బలప్రయోగాలతో రాజకీయాధికారం పొందొచ్చు. సాంస్కృతిక ఔన్నత్యాన్ని మాత్రం సాధించలేం. ఈ ఔన్నత్యానికి ఎన్ని అర్థాలైనా చెప్పుకోవచ్చు. భావాల బలంతో ప్రజలను ఒక కొత్త ధార్మికత, నాగరికతలోకి తీసుకువెళ్లటమే ఆధ్యాత్మిక ఔన్నత్యం అనుకుంటే కశ్మీరులో ఒకనాడు అది శాంతియుతంగా జరిగింది. సూఫీ ప్రవచనాల ప్రభావంతో కశ్మీరు సమాజం ఇస్లాంవైపు మొగ్గింది. శైవ మత సంప్రదాయాలతో వీధి పోరాటాలు చేసి ఇస్లాం అక్కడ పాదుకోలేదు. అందుకే అక్కడ సమ్మిళిత సంస్కృతి బలపడింది. కశ్మీరు పండితులెందరో ఇస్లాంని స్వీకరించారు. స్వీకరించని పండితులను అణగదొక్కలేదు. సమాజంలో వాళ్లూ కీలక పాత్ర పోషించారు. షేక్‌అబ్దుల్లా కుటుంబమూ ఒకనాడు పండిత వర్గానికి చెందిందే. సుప్రీం తీర్పును అనూహ్యం అనలేం. వాదనలప్పుడే ఆ సూచనలు కనిపించాయి. నాలుగేళ్ల సమయాన్ని తీసుకుని ఇచ్చిన ఆ తీర్పుపై సమర్థనలూ విమర్శలూ కూడా ఎక్కువగానే ఉన్నాయి. 70 ఏళ్ల పాటు ఉనికిలో ఉన్న రాష్ట్రాన్ని ప్రజల సమ్మతితో సంబంధం లేకుండా రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా హఠాత్తుగా మార్చివేయటం సాంకేతికంగా తప్పుకాక పోవచ్చు. సంక్లిష్ట సమస్యలపై న్యాయస్థానాల తీర్పులు ప్రజల్లో గట్టి అంగీకారాన్ని తీసుకురాగలిగితే అంతకన్నా సంతోషం ఉండదు. ఎన్నో సందర్భాల్లో అది జరగలేదు. అందుకే మెరుగైన పరిష్కారం కోసం జరిగే చర్చలనూ, చేపట్టే చర్యలనూ నిలువరించే శక్తి ప్రజాస్వామ్యంలో ఏ తీర్పుకూ ఉండదు. రిజర్వేషన్లు 50శాతం మించకూడదనీ రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మార్చకూడదనీ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను తప్పుపడుతూ ఎన్నో విమర్శలు ఇప్పటికీ వస్తూనే ఉన్నాయి. కశ్మీరును భారత్‌లో కలిసిపోయేటట్లు చేయటమే ఆర్టికల్ 370 రద్దు లక్ష్యమైతే దాన్ని సాధించటమే ఇప్పుడు కేంద్రం ముందున్న పెద్ద సవాల్. కల్హణుడు చెప్పినట్లుగా దేశం ముందు రెండే మార్గాలున్నాయి. ముస్లిం విద్వేషాన్ని పక్కనపెట్టి ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని ప్రదర్శించి కశ్మీరు పౌరసమాజంతో చర్చలు జరపటం మొదటిది. రెండోది బలప్రయోగం. కశ్మీరుకు బలప్రయోగం కొత్త కాదు. ఆధునిక కశ్మీరులో బలప్రయోగ దశలే ఎక్కువ. ఆధ్యాత్మిక ఔన్నత్యంతో కూడిన విలువలను కశ్మీరు రాజకీయాల్లో చూపించిన ఘటనలు చాలా తక్కువ. మొదట్లో ఆ దిశగా ప్రయత్నాలు జరిగినా క్రమేపీ అవి క్షీణించాయి. రాజకీయ అవసరాలు, అవకాశవాదాలు, సంకుచిత భావజాలాలు ప్రేరేపించిన మొండితనంతో బలప్రయోగం కశ్మీరులో నిత్యకృత్యమై పోయింది. ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీరీ హృదయం కొత్తగా గాయపడలేదు. రద్దు నాటికే అది అలంకార ప్రాయంగా ఉంది. 1954 నుంచి తీసుకు వచ్చిన 28 రాజ్యాంగ ఉత్తర్వులతో 262 కేంద్ర చట్టాలను కశ్మీరులో అమల్లో పెట్టారు. కశ్మీరు సమస్యను లోతుగా విశ్లేషించిన సుమంత్రబోసు చెప్పినట్లు 1975 నాటికే ఆర్టికల్ 370 డొల్లగా మారింది. కశ్మీరు తొలి ప్రభుత్వాధినేత షేక్‌అబ్దుల్లాని అరెస్టు చేసిన తర్వాత 1954లో తీసుకొచ్చిన రాజ్యాంగ ఉత్తర్వుతోనే స్వయం ప్రతిపత్తి చాలావరకు అంతరించి పోయింది. 1957 జనవరి 26న అమల్లోకి వచ్చిన రాష్ట్ర రాజ్యాంగం భారత యూనియన్‌లో జమ్మూకశ్మీరును అంతర్భాగంగా పేర్కొంది. ఐఏఎస్, ఐపీఎస్, ఇతర అఖిల భారత అధికారులను కశ్మీరులో నియమించటానికి అక్కడి అసెంబ్లీ 1958లో ఆమోదం తెలిపింది. ఇక 1965లో జమ్మూకశ్మీరు రాజ్యాంగానికి చేసిన సవరణలతో ఇతర రాష్ట్రాలతో అది దాదాపుగా సమానమైపోయింది. గవర్నర్ల నియామకం అమల్లోకి వచ్చింది. లోక్‌సభ సభ్యులను ఎన్నుకునే పద్ధతినీ ప్రవేశపెట్టారు. అప్పటివరకూ అసెంబ్లీయే లోక్‌సభకు సభ్యులను నామినేట్ చేసేది. 356, 357 అధికరణాలను కూడా వర్తింప చేశారు. రాష్ట్ర అంశాలపై కేంద్రం చట్టాలు చేసే పరిధిలోకి (ఆర్టికల్ 249) కశ్మీరును తీసుకువచ్చారు. కశ్మీరుకు స్వయం ప్రతిపత్తి కల్పించటం చారిత్రక మహాఘోరమన్న విమర్శలు ఈనాటివి కావు. ఆ విమర్శల్లో సహేతుకత ఉన్నా లేకపోయినా ఒక విషయాన్ని మాత్రం కొట్టేయలేం. అసలు ఆ ప్రతిపత్తే లేకపోతే కశ్మీరు భారత్‌లో విలీనం అయ్యేదే కాదు. మహాఘోరం ఏదైనా ఉంటే విలీనం తర్వాత కశ్మీరుపై ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని చూపించక పోవటమే! 1947 అక్టోబరు 26న కశ్మీరు విలీనంపై మహారాజు హరిసింగ్ సంతకం చేశారు. అంతకుముందు పాక్‌తో యథాతథ ఒడంబడిక చేసుకున్నా గత్యంతరంలేని పరిస్థితుల్లో భారత్ సైన్య సహకారాన్ని కోరారు. రక్షణ, విదేశీ, కరెన్సీ%--%కమ్యూనికేషన్ల వ్యవహారాల్లో మాత్రమే కేంద్రానికి అధికారాలు ఉంటాయని విలీన ఒప్పందంలో పేర్కొన్నారు. దీన్ని స్పష్టంచేస్తూ 1949 అక్టోబరులో రాజ్యాంగంలో ఆర్టికల్ 306ఎ ను పొందుపర్చారు. 306ఎ స్థానంలో ఆర్టికల్ 370ని 1952లో ప్రవేశపెట్టారు. ఏదైనా కేంద్ర చట్టాన్ని జమ్మూకశ్మీరుకు వర్తింపచేయటానికి ఆ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తప్పనిసరి చేశారు. ఇవన్నీ ఎందుకు చేశారు? ముస్లింలను సంతృప్తిపరచటానికే ఇవన్నీ చేశారని చెప్పుకోవటం చాలా తేలిక. కానీ అప్పటి పరిస్థితులు చాలా భిన్నమైనవి. కశ్మీర్ సమస్య అనేక సంక్లిష్టతలతో కూడినది. దేశ విభజనప్పుడు అనుసరించిన పద్ధతులను కశ్మీరు ప్రజలు తిరస్కరించి మరీ భారత్‌లో చేరారు. ఒక మతానికి చెందిన ప్రజల సంఖ్యని బట్టి ఆయా జిల్లాలు, ప్రాంతాల సరిహద్దులను నిర్ణయించి భారత్%--%పాక్‌ల్లో కలిపారు. అందుకే ఎన్నో ఐక్యతలను కలిగినప్పటికీ బెంగాల్, పంజాబ్‌లను మతప్రాతిపదిక మీద నిట్టనిలువుగా చీల్చారు. ఇదే సూత్రాన్ని జమ్మూకశ్మీరుకు అన్వయిస్తే కశ్మీరులోయతో పాటు జమ్మూ, లద్దాఖ్ ప్రాంతాలు కూడా భారత్‌లో విలీనమయ్యేవి కావు. మూడుచోట్లా సంఖ్యాపరంగా ముస్లింలకే ఆధిక్యం ఉండేది. నికరంగా భారత్‌కు నాలుగైదు జిల్లాలు మాత్రమే వచ్చేవి. వ్యాపారం, బంధుత్వం, మతం, సంస్కృతి, భౌగోళికం.. ఇలా దేన్ని తీసుకున్నా పశ్చిమ పంజాబ్‌తోనే కశ్మీరు ప్రజలకు ఎక్కువ సాన్నిహిత్యం ఉండేది. ఈ పరిస్థితుల్లో పాక్‌తో కలిసిపోవటం చాలా సులువు. కానీ అది జరగలేదు. దానికి షేక్‌అబ్దుల్లా సారథ్యంలోని నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించిన పాత్ర చాలా ఉంది. పాక్ ప్రేరిత సాయుధులు కశ్మీరులోకి చొచ్చుకు వచ్చినప్పుడు భారత సైన్యానికి చేదోడుగా నేషనల్ కాన్ఫరెన్స్ నిలిచింది. కాంగ్రెస్‌తో సన్నిహితంగా మెలిగే నేషనల్ కాన్ఫరెన్స్ భారత్‌వైపు మొగ్గు చూపించేది. దీన్ని కూడా పరిగణించి భారత్‌లో విలీనానికి మహారాజు సుముఖత చూపారు. పాక్‌తో కలవటానికి ఎన్నో అనుకూలతలు ఉన్న ప్రాంతం కాబట్టి షరతులతో కూడిన విలీనానికి అంగీకరించారు. గవర్నర్ జనరల్ మౌంట్‌బాటన్ కూడా ప్రజాభిప్రాయానికి లోబడే కశ్మీరు విలీనంపై తుది నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. ఆ షరతుతోనే విలీనానికి ఆమోదం తెలిపారు. ప్రజాభిప్రాయం అనుకూలంగా ఉందనే అంచనాతో ప్లెబిసైట్‌కు నెహ్రూ అంగీకరించారు. ఐరాసకు ఆ భరోసాతోనే కశ్మీరు సమస్యను నివేదించారు.

ఇంతటి సానుకూలత నాలుగేళ్లకే మారిపోవటం మొదలైంది. మూర?పు ముస్లిం వ్యతిరేకతతో కశ్మీరు స్వయం ప్రతిపత్తిని రద్దుచేయాలంటూ తలెత్తిన డిమాండ్లు రాజకీయ వాతావరణాన్ని మార్చివేశాయి. మరోవైపు షేక్‌అబ్దుల్లా ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక భూసంస్కరణలు భూస్వాముల్లో మంటలు పుట్టించాయి. స్వయం ప్రతిపత్తి రద్దు ఆందోళనలకు భూస్వాములు, సంస్థానానికి చెందిన మాజీ అధికారులు మద్దతు పలికారు. అన్ని వైపులనుంచీ ఒత్తిడులు రావటంతో స్వతంత్రంగా ఎందుకు ఉండకూడదనే ఆలోచనలు షేక్‌అబ్దుల్లా చేశారు. ఆ తర్వాతి పరిణామాలతో షేక్‌అబ్దుల్లాని అరెస్టు చేశారు. ఇక అప్పటి నుంచి ఢిల్లీ అనుకూల ప్రభుత్వాలు కశ్మీరులో కొలువుతీరాయి. ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించలేదు. అసంతృప్తితో ఉన్న ప్రజలను అదుపు చేయటానికి బలప్రయోగాలనే ఎంచుకున్నారు. విఫల ప్రభుత్వాలతో విసిగిన ప్రజలను పాక్ ఎగదోసింది. రకరకాల లక్ష్యాలతో తీవ్రవాదులు పుట్టుకొచ్చారు. 1990ల నుంచి 2005 వరకూ వేలమంది హతులయ్యారు. ఆ తర్వాత పరిస్థితి కొంత మెరుగుపడినా తగిన న్యాయం జరగలేదన్న భావన తొలగిపోలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర హోదానే రద్దుచేయటం, ఉద్యోగాలు, ఆస్తుల కొనుగోలు విషయంలో రక్షణలను తొలగించటం ఆ భావనను మరింత పెంచుతోందనే సమాచారమే వస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే తాము మరింత ఓడిపోతున్నామనే భావనలోనే కశ్మీరీయులు ఉండిపోతారు. అప్పుడు కల్హణుడు చెప్పినదే నిజమవుతుంది. లక్షల సైన్యం నేలను గెలుస్తుంది. హృదయాలను గెలవలేదు.

# యుక్తవయసులోనే రక్తపోటు, మధుమేహం సమస్యలు

## అనారోగ్యకర ఆహారం, జీవనశైలి దుష్ఫలితాలు

## కొలన్ లేదా రెక్టమ్ కేన్సర్ ముప్పు

వయసు మీద పడుతుంటే అనారోగ్య సమస్యలు పలకరిస్తుండడం సహజం. కాల క్రమేణా కణాల నష్టం కారణంగా ఇవి తలెత్తుతాయి. అంటే, యుక్త వయసులో ఉన్న వారికి వ్యాధుల ముప్పు ఉండదని కాదు. అనారోగ్యకర జీవనశైలి కారణంగా కొన్ని రకాల వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం యువతీ యువకులకు సైతం ఉంటుంది.

### రక్తపోటు

రక్తపోటు ఆరోగ్యవంతులైన వారిలో 120/80 ఉండాలి. అయితే, దీనిని మించి అధిక రక్తపోటుకు గురైతే మాత్రం అది గుండె ఆరోగ్యాన్ని, మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. గుండె పోటు లేదా బ్రెయిన్ స్ట్రోక్ రిస్క్ ను ఎదుర్కోవాల్సి వస్తుంది. కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉంటే చిన్న వయసులోనే వారసుల్లో ఇవి కనిపించొచ్చు. ఇటీవలి కాలంలో మనం 40-50 ఏళ్ల మధ్యలో సెలబ్రిటీల మరణాలు చూస్తున్నాం. యువతీ యువకులు డ్యాన్స్ చేస్తూ కుప్పకూలిపోవడం కనిపిస్తోంది. గుండెకు సంబంధించి ఎక్కువ ముప్పు కలిగించే వాటిల్లో అధిక రక్తపోటు ఒకటి. అందుకే కనీసం మూడు లేదా ఐదు నెలలకు ఒకసారి బీపీ చెక్ చేయించుకోవాలి.

### టైప్ 2 మధుమేహం

టైప్ 2 మధుమేహం రిస్క్ కూడా యువతీ యువకుల్లో పెరుగుతోంది. 14 నుంచి 25 ఏళ్ల వయసులోపు వారిలో ఈ కేసులు 20 శాతం పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. మధుమేహం బారిన పడిన వారు దీన్ని నియంత్రణలో పెట్టుకోకపోతే అది శరీరంలోని కీలక అవయవ వ్యవస్థను దెబ్బతీస్తుంది.

### ఆస్టియో పోరోసిస్

చిన్న వయసులో ఎముకల సాంద్రత ఎక్కువగా ఉంటుంది. 35 ఏళ్లకు వచ్చిన తర్వాత ఎముకలు ఈ సాంద్రతను క్రమంగా కోల్పోతుంటాయి. ఆస్టియోపోరోసిస్ సమస్య బారిన పడిన వారిలో ఇది మరింత వేగంగా జరుగుతుంది. అంటే ఎముకలను బలహీన పరుస్తుంది. దీంతో ఫ్రాక్చర్ల ముప్పు పెరుగుతుంది. జారి పడిపోయినా, బ్యాలన్స్ తప్పినా ఫ్రాక్చర్ల బారిన



**బవెల్ కేన్సర్**

**దీన్నే పేగు కేన్సర్ అని కూడా అంటారు. చిన్న పేగు, పెద్ద పేగు, పురీష నాళం (రెక్టమ్)లో ఎక్కడైనా ఇది రావచ్చు. దీనికి కచ్చితమైన కారణాలను ఇప్పటికీ గుర్తించలేదు. కాకపోతే అతిగా మద్యం సేవించే వారు, ఫైబర్ లేని ఆహారం తీసుకునే వారికి రిస్క్ ఎక్కువని పలు అధ్యయనాల్లో గుర్తించారు. ఎక్కువగా యుక్తవయసులో వారు దీని బారిన పడుతున్నారు. 1950ల్లో పుట్టిన వారితో పోలిస్తే 1990ల్లో పుట్టిన వారికి దీని రిస్క్ రెట్టింపు ఉంటుందట.**

పడుతుంటారు. సాధారణంగా 50 ఏళ్ల పైబడిన వారిలో ఈ రిస్క్ ఎక్కువ. కానీ నేటి జీవనశైలితో 30, 40 ఏళ్లల్లోనూ దీని బారిన పడుతున్నారు.

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, రోజువారీ వ్యాయామం చేస్తూ నిశ్చలమైన జీవనశైలికి దూరంగా ఉండాలి. ఉప్పు, చక్కెర వినియోగాన్ని తగ్గించాలి. పీచు పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మద్యపానం, సిగరెట్లకు స్వస్తి చెప్పాలి. ఏడాదికోసారి అయినా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.



**35 శాతం మందికి బీపీ**

**ఐసీఎంఆర్ నివేదిక వెల్లడి**

**కొంత మెరుగ్గా తెలుగు రాష్ట్రాల పరిస్థితి**

# దేశ జనాభాలో 11 శాతం మందికి మధుమేహం

దేశంలో మధుమేహ బాధితుల సంఖ్య వేగంగా పెరిగిపోతోందని, బీపీ బాధితులు కూడా ఎక్కువేనని ఇండియాస్ మెటబాలిక్ హెల్త్ రిపోర్ట్ (ఐసీఎంఆర్) వెల్లడించింది. జనాభాలో 11 శాతం మందికి మధుమేహం ఉందని పేర్కొంది. మరో 15 శాతం మంది ప్రీడయాబెటిక్ స్టేజిలో ఉన్నారని తెలిపింది. బీపీతో బాధపడుతున్న వారి సంఖ్య తక్కువేం కాదని, మొత్తంగా 35.5 శాతం మంది రక్తపోటు బాధితులేనని వెల్లడించింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన అధ్యయనంలో ఈ వివరాలు బయటపడ్డాయని తెలిపింది. ఈ పరిశోధనా ఫలితాలను లాన్సెట్ జర్నల్ కూడా ప్రచురించింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అసాంక్రమిక వ్యాధుల భారాన్ని అంచనా వేయడానికి ఈ అధ్యయనం చేపట్టినట్లు ఐసీఎంఆర్ శాస్త్రవేత్తలు తెలిపారు. ఇందులో భాగంగా 1,13,043 మంది నుంచి నమూనాలు సేకరించి, విశ్లేషించామని వివరించారు. ఈ నివేదిక ప్రకారం.. మధుమేహం, బీపీ బాధితుల విషయంలో తెలుగు రాష్ట్రాల పరిస్థితి కొంతవరకు మెరుగ్గానే ఉందని చెప్పారు. మధుమేహ బాధితులు ఎక్కువగా గోవా, పుదుచ్చేరి, కేరళ, చండీగఢ్, ఢిల్లీలలో ఉన్నారని, ఈ జాబితాలో తెలంగాణ 17వ స్థానంలో, ఆంధ్రప్రదేశ్ 19వ స్థానంలో నిలిచాయని తెలిపారు. తెలంగాణలో 9.9 శాతం, ఏపీలో 9.5 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నారని చెప్పారు.

# 'సలార్'.. వరల్డ్ వైడ్ టార్గెట్ ఎంతంటే?



ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన 'సలార్' మూవీ డిసెంబర్ 22న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ కాబోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే సినిమాపై ఓ రేంజ్ లో అంచనాలు ఉన్నాయి. ఫ్యాన్స్ తో పాటు ఆడియన్స్ ఈ మూవీ కోసం ఎంతో ఎక్సైటింగ్ గా వెయిట్ చేస్తున్నారు. కాగా ప్రపంచవ్యాప్తంగా సలార్ మూవీకి భారీ బిజినెస్ జరిగింది. అందుకు సంబంధించిన వివరాలు బయటకు వచ్చాయి. సలార్ మూవీ ప్రపంచవ్యాప్తంగా బ్రేక్ ఈవెన్ అవ్వాలంటే ఏకంగా రూ.800 కోట్ల గ్రాస్ వసూలు చేయాలి. ఏరియా వైజ్ గా చూసుకుంటే.. తెలంగాణలో సలార్ మూవీ రైట్స్ రూ.65 కోట్లకు అమ్ముడయ్యాయి. ఈ లక్ష్యాన్ని చేదించాలంటే ఈ మూవీ దాదాపు రూ.100 కోట్ల గ్రాస్ వసూలు చేయాల్సి ఉంటుంది. ఇక ఆంధ్రప్రదేశ్లో సలార్ థియెట్రీకల్ రైట్స్ రూ.95 కోట్లు, అంటే అక్కడ ఏకంగా రూ.150 కోట్ల గ్రాస్ వసూలు చేయాలి.

తెలంగాణ, ఏపీ రెండు తెలుగు రాష్ట్రాల్లో సలార్ బ్రేక్ ఈవెన్ అందుకోవాలంటే దాదాపు రూ.250 కోట్ల గ్రాస్ వసూలు చేయాల్సి ఉంటుంది. ఇవి కాకుండా కర్ణాటక, కేరళ, తమిళనాడు ఇతర దక్షిణాది రాష్ట్రాలలో సలార్ నిర్మాతలు సొంతంగా ఈ సినిమాని విడుదల చేస్తున్నారు. అక్కడి వ్యాల్యుడ్ బిజినెస్ ప్రకారం చూసుకుంటే మూడు రాష్ట్రాలకు కలిపి సినిమాకి సుమారు రూ.65 కోట్ల బిజినెస్ జరిగింది. ఈ మూడు రాష్ట్రాల్లో రూ.130 కోట్ల గ్రాస్ వసూలు చేస్తే సలార్ బ్రేక్ ఈవెన్ అయినట్లే. ఇక ప్రపంచవ్యాప్తంగా సలార్ బ్రేక్ ఈవెన్ కావాలంటే రూ.800 కోట్ల గ్రాస్ రాబట్టాలి. సో టోటల్ గా సౌత్ ఇండియన్ నుంచి ఈ మూవీ రూ.380 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేయాల్సి ఉంటుంది. నార్త్ ఇండియాలో బిజినెస్ వాల్యూ ప్రకారం బ్రేక్ ఈవెన్ కోసం రూ.230 కోట్ల గ్రాస్ రాబట్టాలి. సౌత్, నార్త్ రెండు కలిపితే ఇండియా వైడ్ గా రూ.610 కోట్ల గ్రాస్ రాబడితే సలార్ బ్రేక్ ఈవెన్ అయినట్లు లెక్క. ఇక ఓవర్సీస్ విషయానికి వస్తే, ఈ మూవీ పబ్లిసిటీ ప్రింట్ ఖర్చులతో సహా రూ.75 కోట్లకు అమ్ముడైంది. అక్కడ బ్రేక్ ఈవెన్ అవ్వాలంటే రూ.150 కోట్ల గ్రాస్ ను కలెక్ట్ చేయాలి. అలా మొత్తం వరల్డ్ వైడ్ ఈ మూవీ రూ.800 కోట్ల గ్రాస్, రూ.400 కోట్ల షేర్ వసూలు చేయాల్సి ఉంటుం ది. మరి భారీ ప్రీ రిలీజ్ బిజినెస్ తో బాక్సాఫీస్ బరిలోకి దిగుతున్న 'సలార్' బ్రేక్ ఈవెన్ సాధించి నిర్మాతలకు లాభాలను అందిస్తుందా? లేక నష్టాలను తెచ్చి పెడుతుందా? అనేది చూడాలి.



## కళ్యాణి ప్రియదర్శన్ చీర స్టైల్ పాయింట్‌లో ఉంది



## లవ్లీ బ్యూటీ సలోని సాంప్రదాయ లుక్స్



## సుక్కు టెన్షన్.. అంతకుమించి..!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా పుష్ప 2 మూవీ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా లెవల్ లో పుష్పకి సీక్వెల్ గా ఈ సినిమా సిద్ధం అవుతోంది. 2024 ఆగస్టులో థియేటర్స్ లోకి తీసుకురావడానికి ప్లాన్ చేసుకుంటున్నారు. రష్మిక మందన మూవీలో హీరోయిన్ గా నటించింది. ఇదిలా ఉంటే ఈ సినిమాతో కమెడియన్ కేశవ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. అల్లు అర్జున్ ఫ్రెండ్ క్యారెక్టర్ లో నటించాడు. పుష్ప మూవీ స్టోరీ కూడా కేశవ పాయింట్ ఆఫ్ వ్యూ నుంచి స్టార్ట్ అవుతుంది. కథ మొత్తం అతనే నేరేట్ చేస్తాడు. దీంతో కేశవ క్యారెక్టర్ సినిమాలో బాగా పేలింది. స్టార్ యాక్టర్ గా మారిపోయాడు. ఈ సినిమా తర్వాత ఒక్కసారిగా స్టార్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా మారిపోవడంతో అవకాశాలు నిండుగా వచ్చాయి. అయితే తాజాగా ఓ అమ్మాయి ఆత్మహత్య కేసులో కేశవ ఇరుక్కున్నాడు. పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. నేరం ఒప్పుకోవడంతో రిమాండ్ కి తరలించారు. కేశవ అరెస్ట్ కావడం ఇప్పుడు పుష్ప టీంకి పెద్ద తలనొప్పిగా మారింది.

సుకుమార్ పైకి సున్నితంగా కనిపించినా షూటింగ్ టైమ్ లో చాలా టెన్షన్ గా ఒత్తిడిగా ఫీల్ అవుతూ ఉంటాడు. ఆ విషయాన్ని పుష్ప 2 సక్సెస్ మీట్ లో కూడా చెప్పాడు. తనకు షూటింగ్ జరుగుతున్నన్నీ రోజులు అసలు ప్రశాంతత ఉండదు అని, సినిమా షూటింగ్ ఫినిష్ అయ్యి రిలీజ్ అయ్యే వరకు టెన్షన్ తో గందరగోళంగా ఉంటానని అన్నాడు. అలాంటిది ఇప్పుడు కేశవ వ్యవహారం ఆయనకు కోలుకోలేని ఒత్తిడి భారాన్ని మోపింది. సినిమాలో అతని పాత్రే కీలకం కాబట్టి ఎలా అయిన బెయిల్ మీద తీసుకురావాలని నిర్మాతలు ప్రయత్నం చేశారు. అయితే నేరం ఒప్పుకోవడంతో కేసు మరింత స్ట్రాంగ్ అయ్యింది. ఇప్పుడు బెయిల్ పొందడం మరింత కష్టం అయ్యింది. ఇలాంటి పరిస్థితిలో అతని క్యారెక్టర్ లేకుండా సినిమా చేయడం ఎలా అనే ఆలోచనలో దర్శకుడు సుకుమార్ పడ్డాడు.

ఇప్పుడు సగానికి పైగా షూటింగ్ కంప్లీట్ అయిపోయిన తర్వాత ఉన్నపళంగా క్యారెక్టర్ ని తీసేసిన, కథ నేరేషన్ మార్చేసిన ఇబ్బంది అవుతుంది. అలా అని డూప్ ని తీసుకొచ్చి చేయించే పరిస్థితి ఉండదు. వేరొక ఆర్టిస్ట్ తో కేశవ చేసిన క్యారెక్టర్ ని రీప్లేస్ చేసే ఛాన్స్ కూడా ఉండదు. సీరియల్స్ లో పాజిబుల్ అయినట్లు సినిమాలలో కుదరదు.

చాలా తక్కువ సందర్భాంలో ఇలా క్యారెక్టర్ లో ఆర్టిస్ట్ రీప్లేస్ చేయడం సాధ్యం అయ్యింది. అలా చేసిన కూడా కంటెంట్ లో మార్పులు చేసి రిప్రజెంట్ చేశారు. మరి పుష్ప లాంటి పాన్ ఇండియా సినిమాలో కేశవ చేసిన క్యారెక్టర్ ఇప్పుడు సుకుమార్ కి పెద్ద తలనొప్పిగా మారింది. దీనికి ఎలాంటి ప్రత్యామ్నాయం చేస్తారనేది వేచి చూడాలి.